

హరోంహర..

కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా జిల్లావ్యాప్తంగా శైవక్షేత్రాలు భక్తులతో కిక్కిరిశాయి. స్వామికి అభిషేకాలు, రుద్రాభిషేకాలు, బిళ్వార్చనలు నిర్వహించారు. పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

కదం తొక్కిన ఆశా వర్కర్లు

ఏలూరు రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లతో ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన చర్చల్లో యూనియన్‌తో చేసుకున్న ఒప్పందాలను జీవోలుగా విడుదల చేయాలని కోరుతూ ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్రకమిటీ పిలుపులో భాగంగా కలెక్టరేట్ వద్ద ఆశావర్కర్లు కదం తొక్కారు. పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి ఆశాలు తరలివచ్చారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కమల అధ్యక్షత వహించారు. రాష్ట్ర అధ్యక్షురాలు కె.పోశమ్మ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాల జీవోలు ఇవ్వమంటే తమకు సంబంధం లేనట్లుగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. ఆశాలకు వయోపరిమితి 62 ఏళ్లకు పెంచుతూ గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.6లక్షలు, రిటైర్‌మెంట్ బెన్‌ఫిట్ రూ.60 వేలు ఇస్తామని వాగ్దానం చేసి గతప్రభుత్వం జీవోలు ఇవ్వకుండా మోసగించిందన్నారు. గత ఆరునెలలుగా ఎటువంటి స్పందన లేకపోవడంతో రోడ్డు ఎక్కాల్సి వచ్చిందన్నారు. సకాలంలో జీతాలు ఇవ్వకుండా చేసుకున్న ఒప్పందాలు అమలు చేయకుండా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గౌరవాధ్యక్షురాలు కె.విజయలక్ష్మి, కట్టా భాస్కర్‌రావు, కె.శ్రీనివాస్, కె.లెనిన్, సోమయ్య, లోకేశ్వరి, కామేశ్వరి, నవ్యమంగతాయారు తదితరులు నాయకత్వం వహించారు. అనంతరం కలెక్టర్‌ను వెట్రిసెల్విని కలిసి వినతిపత్రం అందజేశారు.





వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, అధికారులు

ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం

» కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అందే ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇస్తూ త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ వెట్రిసెల్వి సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అర్జీదారుల నుంచి 245 అర్జీలు స్వీకరించారు. జేసీ టి.ధాత్రిరెడ్డి, డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, ఆర్డీవో అచ్యుత అంబరీష్, డీఆర్‌డీఏ పీడీ ఆర్. విజయ్‌రాజు తదితర అధికారులతో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదులు స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలు తెలుసు కుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామ న్నారు.



ఫిర్యాదుదారుల వద్దకు వెళ్లి సమస్యలను తెలుసుకుంటున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

ఏలూరు క్రైం : సైబర్ నేరగాళ్లు పంపే అనుమానాస్పద కాల్స్ మెస్సేజ్‌లు, ఈ-మెయిల్స్ లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కేపీఎస్ కిశోర్ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో 40 ఫిర్యాదులను ఎస్పీ ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు స్వీకరించి వాటి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగాలు పేరుతో మోసాలు చేసే మోసగాళ్ల వలలో పడవద్దన్నారు. సైబర్ నేరాలకు గురయితే వెంటనే 1930కు సమాచారం ఇవ్వాలన్నారు.



పిల్లలతో పనేంటి.. పోటీకి రండి!

ఇంతకుముందు ఇద్దరికంటే పిల్లలు ఎవరికైనా ఉంటే అలాంటి వారంతా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులు. ఒకవేళ సర్కారు కన్నుగప్పి ముగ్గురు పిల్లలున్నా.. ఇద్దరు పిల్లలే అన్నట్టుగా నామినేషన్ వేసినా చివరికి అది పరిశీలనలో వీగిపోయేది. ఎవరైనా ముసుగేసి ఇంకాస్త ముందడుగు వేద్దామన్నా ప్రత్యర్థులు ఫిర్యాదులు చేసేవారు. అంతలా ఇద్దరి పిల్లల నిబంధన స్థానిక రాజకీయాలకు ఒక పెద్ద అడ్డంకి. కాని రాష్ట్ర ప్రభుత్వం ఇకమీదట ఇద్దరి కంటే మించి పిల్లలున్నా స్థానిక సంస్థల్లో పోటీకి అర్హులేనంటూ తాజాగా శాసనసభలో తీర్మానం ఆమోదించింది. ఇంకేముంది రాబోయే ఎన్నికలన్నింటిలోనూ పిల్లలతో పనిలేదు.. పోటీకి రెడీ కండి అనే నినాదమే తెరముందుకు వచ్చింది.

» స్థానిక సంస్థల్లో ఇద్దరు కంటే మించి పిల్లలుంటే అనర్హత నిబంధన తొలగింపు
» శాసనసభలో తాజాగా తీర్మానం
» స్వాగతిస్తున్న రాజకీయ పక్షాలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఒకప్పుడు ఒకరంటే ముద్దు.. ఇద్దరికంటే వద్దు ఇదే కుటుంబ నియంత్రణ నినాదం. నాలుగు దశాబ్దాల కిందట నుంచే ఈ నినాదం చాలా వేగంగా పాకింది. ఉమ్మడి కుటుంబాలు, అతి పెద్ద కుటుంబాలు క్రమేపీ అదృశ్యమయ్యాయి. పెరుగుతున్న కుటుంబ వ్యయం, ఆర్థిక స్థితిగతులు నేపథ్యం ఒకటైతే, మహిళల ఆర్థిక పరిస్థితులు, సంతానోత్పత్తి, ఇతరత్ర అంశాలకు అడ్డంకిగా మారడం ఇంకో ఎత్తు. దీనికనుగుణంగానే స్థానిక సంస్థల్లో పోటీ చేసేవారంతా ఇద్దరు పిల్లలకు మించి ఉండరాదని, అలాంటి వారు ఎవరైనా పోటీకి అనర్హులేనని ప్రభుత్వం ఇంతకు ముందే నిర్ధారించింది. ఇక అప్పటి నుంచి ఈ నిబంధనను అన్ని ఎన్నికల్లోను పాటిస్తున్నారు. దీనిపై కొందరు రాజకీయ, రాజకీయేతర ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కోల్పోయింది. ఉదాహరణకు పంచాయతీ ఎన్నికల్లో ఆ ఊరికి ఒకప్పటి తరానికి చెందిన కుటుంబంలోనే వరుసగా సర్పంచ్‌లుగా ఎన్నికయ్యేవారు. ఆ ఊరిలో ఉన్న నిబంధన, ఆకాంక్ష అటువంటిది. ఒక్కసారిగా ఈ నిబంధనల కారణంగా అందరు మెచ్చే కుటుంబం నుంచి పోటీకి వీలులేకుండా పోయింది. ఆయా కుటుంబాల్లో పిల్లల సంఖ్య ఎక్కువగా ఉండడతో ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాన్ని కోల్పోవాల్సి వచ్చింది.

ఇప్పుడు ఎలాంటి అడ్డంకి లేదు

జాతీయ స్థాయిలో ఈ మధ్యకాలంలో వయోవృద్ధుల సంఖ్య భారీగా పెరుగుతున్న నేపథ్యంలో తిరిగి యువతరం పరుగులు పెట్టాలన్న కాంక్ష అందరిలోనూ ప్రారంభమైంది. ఆ దిశగానే ప్రభుత్వం వేగంగా అడుగులు కదుపుతోంది. ఇప్పటికే పిల్లలను కనండి.. అంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వీలు చిక్కిన ప్పుడల్లా ప్రజలకు పిలుపునివ్వడం ఆరంభించారు. ఎక్కడైతే యువతరం అందుబాటులో ఉంటుందో ఆ రాష్ట్రం త్వరితగతిన అభివృద్ధి చెందుతుందని, దక్షిణాది రాష్ట్రాల్లో అంతర్జాతీయ స్థాయిలో ఉన్నట్టుగానే వయోవృద్ధుల సంఖ్య పెరుగుతోందని, ఈ అంశంలో అప్రమత్తం కావాల్సిందేనని సీఎం చంద్రబాబు తరచూ ఆకాంక్షిస్తున్నారు. ఈ కారణంగానే రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని అసెంబ్లీలో సోమవారం ఇద్దరు పిల్లల కంటే మించి సంతానం ఉన్నా ఎన్నికల్లో పోటీ చేయవచ్చునంటూ ఒక తీర్మానం ఆమోదించారు. ముఖ్యమంత్రి ఇన్నాళ్ళు తరచూ చేస్తున్న విజ్ఞప్తులకు అనుగుణంగానే అసెంబ్లీలోనూ తీర్మానం ఆమోదించడం ద్వారా సరికొత్త రికార్డు సృష్టించారు. ఇప్పటివరకు కేవలం ఇద్దరిలోపే పిల్లలు ఉంటేనే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హులు. ఇప్పుడు దానికి తెరదించి ఇక ఎంతమంది పిల్లలున్నా పోటీ చేయడానికి ఎలాంటి ఆటంకాలు లేనట్టే. ఆ దిశగా శాసనసభ తీర్మానం ఆమోదించడంతో ఇక స్థానిక ఎన్నికల్లోను, సాధారణ ఎన్నికల్లో అభ్యర్థులకు ఎలాంటి ఆటంకం లేనట్టే. ఇప్పుడున్న పరిస్థితులకు అనుకూలంగానే రాష్ట్ర ప్రభుత్వం స్పందించిందని, తిరిగి రాజకీయాల్లో ఈ ఒక్క విషయం మినహాయించి రూటు క్లియర్ చేశారనే భావనే అత్యధికుల్లో ఉంది. ఇప్పటి తరమైనా సంతానోత్పత్తిలో కొంత చొరవ తీసుకుంటేనే తప్ప దేశానికి యువరక్తం రావడం కష్టమే. ఇప్పుడు ఎలాగూ రాజకీయాల్లో ఉన్న అడ్డంకులను తొలగిస్తూ ప్రభుత్వమే కీలక నిర్ణయం తీసుకోవడంతో కొంత మార్పు వచ్చే అవకాశం లేకపోలేదు. ఉద్యోగ వర్గాల్లో అత్యధి కులు ఇప్పటికే ఒకరితో సంతానంతో ఫుల్‌స్టాప్ పెడుతున్నారు. మధ్యతరగతి కుటుంబాలన్నింటి లోనూ ఇలాంటి పరిస్థితే ఉంది. రాజకీయ కుటుంబాల్లో ఇద్దరి కంటే మించి అనే పదం ఆటంకం కావడంతో ఇన్నాళ్ళు ఆ కుటుంబాలు ధైర్యం చేయలేదు. రాష్ట్ర ప్రభుత్వం జనాభా పెరగాలన్న ఆకాంక్షకు అనుగుణంగా ఏఏ వర్గాలు ఎలా స్పందిస్తాయో రాబోయే ఐదేళ్లల్లో గాని తెలియదు.

శుభపరిణామం



ఇద్దరి పిల్లలకంటే ఎక్కువ ఉన్న వారు పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులనే నిబంధనను చంద్రబాబు ప్రభుత్వం రద్దు చేయడం మంచి నిర్ణయం. ఇప్పటివరకు ఈ నిబంధనతోనే ఎన్నికల్లో పోటీ చేయడానికి అత్యధికులు వెనకడుగు వేశారు. గ్రామాల్లో రాజకీయంగా ఎదగడానికి అనేక మందికి ఈ నిర్ణయం ఎంతో దోహద పడుతుంది.

- కడలి గోపాలరావు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పంచాయతీ చాంబర్ అధ్యక్షుడు

ఫీజుల చెల్లింపు గడువు పొడిగింపు

ఏలూరు అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఏపీ సార్వత్రిక విద్యాపీఠం (అపోస్) దూరవిద్య పదో తరగతి, ఇంటర్మీడియట్‌లలో తత్కాల్ విధానంలో రూ.600 అపరాధ రుసుం చెల్లింపుపై అడ్మిషన్లు పొందేందుకు గడువును ఈనెల 25 వరకు పొడిగించారని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. అభ్యర్థులు ముందుగా ఏపీ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని అడ్మిషన్లు పొందవచ్చన్నారు. వచ్చే ఏడాది మార్చినెలలో జరగనున్న పదోతరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లించే గడువును ఈనెల 26 వరకు పొడిగించినట్లు డీఈవో తెలిపారు. అపరాధ రుసుం రూ. 500 చెల్లింపుపై పరీక్ష ఫీజును డిసెంబరు 16 వరకు చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు. విద్యార్థుల ఎస్‌ఆర్ డేటా, ఇతర పత్రాలను స్కూల్ హెచ్‌ఎంలు ఆన్‌లైన్‌లో సమర్పిం చేందుకు ఇవే గడువులు వర్తిస్తాయని వివరించారు.

పట్టిసీమ ఎత్తిపోతల నుంచి నీరు విడుదల

పోలవరం నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 8,142 క్యూసెక్కుల నీటిని పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్లు డీఈఈ పెద్దిరాజు సోమవారం తెలిపారు. గోదావరి నీటిమట్టం 14.126 మీటర్లు ఉందని ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు 23 పంపులు 23 మోటార్లతో నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కృష్ణా, రాయలసీమ, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల సాగు, తాగు నీటి అవసరాల రీత్యా పంపుల సంఖ్య పెంచినట్లు తెలిపారు. గడిచిన రెండు రోజుల్లో 13.5439 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు.

మామిడి రైతులకు సూచనలు ఇస్తున్నాం..

ఏలూరుసిటీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధాన ఉద్యాన పంట అయిన మామిడి 30 వేల ఎకరాల్లో సాగు అవుతోందని, రైతు సేవా కేంద్రాల ద్వారా ఉద్యాన శాఖాధికారులు, ఉద్యాన గ్రామ సహాయకులు రైతులకు తగిన సూచనలు , సలహాలు ఇస్తున్నట్టు జిల్లా ఉద్యాన శాఖాధికారి ఎస్.రామ్మోహన్ సోమవారం తెలిపారు. ఉద్యాన శాఖ ద్వారా పంట విస్తీర్ణం కింద ఎంఐడీహెచ్ పీఆర్‌కేవై పథకాల ద్వారా రాయితీ ఇస్తున్నట్టు తెలిపారు. నవంబరు నుంచి పూత మొదలవుతుందని కావున 250 హెక్టార్లలో మామిడి తొడుగులను లక్ష్యంగా నిర్దేశించారన్నారు. దీనికి గాను రాయితీ వివరాలను మామిడి రైతులకు తెలిపామని, మామిడి రైతులు దరఖాస్తులను ఇవ్వాలని కోరామన్నారు.

ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు..

ముగిసిన నామినేషన్ల స్వీకరణ

» చివరి రోజు నాలుగు నామినేషన్ల దాఖలు
» మొత్తం ఆరుకు చేరుకున్న నామినేషన్లు
» నేడు పరిశీలన.. ఈనెల 21 వరకు ఉపసంహరణలు
» వచ్చేనెల 5న పోలింగ్.. 9న కౌంటింగ్

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సోమవారం ఒక్కరోజే నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. వీరు నలుగురు స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు సమర్పించారు. కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన నామన వెంకటలక్ష్మి, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన కవల నాగేశ్వరరావు, పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడేనికి చెందిన పులుగు దీపక్, మన్యం జిల్లా పార్వతీపురానికి చెందిన అహమద్‌షేక్ నామినేషన్లను సహాయ రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా డీఆర్వో వెంకట్రావుకు అందజేశారు. ఈనెల 11వ తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కాగా తొలుత బొర్రా గోపి మూర్తి, తర్వాత గంధం నారాయణరావు నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో చివరిరోజైన సోమవారానికి నామినేషన్ల సంఖ్య ఆరుకు చేరుకుంది. మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో నామినేషన్ల పరిశీలన క్రతువు జరుగుతుంది. ఈనెల 21వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణ నిర్వహిస్తున్నారు. వచ్చేనెల 5న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరుగు తుంది. ఎన్నికల పోలింగ్ కోసం ఆరు జిల్లాల పరిధిలో 116 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 12, తూర్పు గోదావరి జిల్లాలో 20, ఏలూరు జిల్లాలో 20, కాకినాడ జిల్లాలో 22, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 22, పశ్చిమ గోదావరి జిల్లాలో 20 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తంగా 16,316 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. దీనిలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో 614 మంది ఓటర్లు, తూర్పు గోదావరి జిల్లాలో 2,893, ఏలూరు జిల్లాలో 2,605, కాకినాడ జిల్లాలో 3,333, కోనసీమ జిల్లాలో 3209, పశ్చిమ గోదావరి జిల్లాలో 3662 మంది ఓటర్లు ఉన్నారు. వచ్చేనెల 9న కౌంటింగ్ జరగనుంది. అదే రోజు ఎన్నికల ఫలితాలను వెల్లడించనున్నారు. నామి నేషన్ల స్వీకరణ గడువు ముగియడంతో ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. దీంతో ప్రస్తు తానికి బరిలో ఆరుగురు అభ్యర్థులు ఉన్నారు. ఈనెల 21 వ తేదీ ఉప సంహరణల తర్వాత బరిలో ఎవ రు నిలుస్తారో లెక్క తేల నుంది.

ఓటర్ల జాబితాపై అభ్యంతరాలుంటే తెలపండి

ఏలూరుసిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి , ఉమ్మడి కృష్ణా -గుటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఏలూరు జిల్లాలో మొత్తం 82 పోలింగ్ కేంద్రాలు ప్రతిపాదించినట్టు జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలపై వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో యు.బాలానందం, ఎస్.అచ్యుతబాబు (టీడీపీ), ఎన్.నెలరాజు (బీజేపీ), ఆర్.సత్యనారా యణ (ఆమ్‌ఆద్మీపార్టీ), పి.కిశోర్ (సీపీఎం), డి.రత్నబాబు, ఎస్.భరత్‌రావు (బీఎస్పీ), రాజనాల రామ్మోహనరావు (ఐఎన్‌సీ), ఎం.వెంకటనాగరాజు (జేఎస్‌పి) పాల్గొన్నారు. డీఆర్వో మాట్లాడుతూ ఈ ఎన్నికలకు సంబంధించి ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి పట్టభద్రుల నియోజకవర్గానికి ఏలూరు డివిజన్‌లో 33, నూజివీడు డివిజన్‌లో 6, జంగారెడ్డిగూడెం డివిజన్‌లో 23 పోలింగ్ కేంద్రాలు ప్రతిపాదించారన్నారు. ఉమ్మడి కృష్ణా- గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి ఏలూరు జిల్లాలో ఏలూరు డివిజన్‌లో 8, నూజివీడు డివిజన్‌లో 20 పోలింగ్ కేంద్రాలు ప్రతిపాదిచినట్టు తెలిపారు. నవంబరు 23న తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తారని, 23 నుంచి డిసెంబరు 9వ తేదీ వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు సమర్పించవచ్చని, డిసెంబరు 30న తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తారన్నారు.

సబ్సిడీ సొమ్ము జమలో జాప్యం



● వారం గడుస్తున్నా గ్యాస్ సబ్సిడీ సొమ్ములు అందలేదని ఆవేదన
● జిల్లాలో లక్షా 70 వేల గ్యాస్ సిలిండర్ల వరకు బుకింగ్
● ఇప్పటివరకు డెలివరీ అయిన సిలిండర్లు లక్షా 11వేల 539
● ఇవ్వాల్సింది రూ. 6.15 కోట్లు.. జమ అయింది రూ. 5.13 కోట్లు

ఏలూరుసిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : 'ఉచిత గ్యాస్ సిలిండర్ తీసుకుని వారం రోజులు దాటింది. రెండో వారంలోను సబ్సిడీ సొమ్ము మా బ్యాంకు ఖాతాలోకి జమ కాలేదు. గతంలో గ్యాస్ బండ తీసుకున్నప్పుడు సబ్సిడీ సొమ్ము అదే బ్యాంకు ఖాతాకు జమయ్యేది. అంటే ఈ-కేవైసీ ఉన్నట్లే కదా. ఇప్పుడు ఎందుకు సబ్సిడీ సొమ్ములు ఎందుకు జమ కావడం లేదో అర్థం కావడం లేదు. మళ్లీ ఈ-కేవైసీ చేయించుకోవాలా అనే ప్రశ్న తలెత్తుతోంది' - ఇది ఉచిత గ్యాస్ సిలిండర్ పొందిన ఏలూరుకు చెందిన లబ్ధిదారు కె.విజయకుమారి ఆవేదన. ఇలా జిల్లాలో ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకంలో ఉచిత గ్యాస్ సిలిండర్ ఇంటి వద్దకే వచ్చినా తమ బ్యాంకు ఖాతాల్లో సబ్సిడీ సొమ్ములు జమ కావడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ సిలిండర్ డెలివరీ అయిన 48 గంటల్లో సబ్సిడీ సొమ్ములు జమ అవుతాయని ప్రభుత్వం ప్రకటించినా కొంత మందికి (అర్హులైన లబ్ధిదారులకు) సబ్సిడీ సొమ్ములు అందక పోవడంలో ఆంతర్యమేమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ-కేవైసీ కాక పోవడమా మరే ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయో అర్థం కావడం లేదని వాపోతున్నారు.

జిల్లా వ్యాప్తంగా లక్షా 70వేల వరకు గ్యాస్ సిలిండర్లు కావాలని అర్హులైన లబ్ధిదారులు బుకింగ్ చేసుకున్నారు. ఈనెల 15 వ తేదీ వరకు అందిన సమాచారం ప్రకారం జిల్లాలోని 76 వేల 884 మంది లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్లు డెలివరీ అయ్యాయని జిల్లా పౌరసరఫరాల శాఖ నివేదికలు చెబుతు న్నాయి. దీనికి సంబంధించి లబ్ధిదారులకు 6కోట్ల 15లక్షల 92వేల 985 రూపాయలను సబ్సిడీ సొమ్ములను బ్యాంకు ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం 63 వేల 894 మంది లబ్ధిదారులకు 5కోట్ల 13లక్షల 4వేల 14 రూపాయల సబ్సిడీ సొమ్ములు వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయి.

ఈ-కేవైసీ ఇబ్బందులు

ఉచిత గ్యాస్ సిలిండర్ పొందడానికి అర్హులైన లబ్ధిదారులు ఈ-కేవైసీ చేయించుకోకుంటే వారికి సబ్సిడీ సొమ్ములు జమ కావడం లేదని చెబుతున్నారు. జిల్లాలో వివిధ కంపెనీలకు చెందిన 55 గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. ఇప్పటికే జిల్లాలో ఉచిత గ్యాస్ సిలిండర్లు పొందడానికి అర్హులైన లబ్ధిదారుల జాబితాలు వచ్చాయి. అయితే ఇందులో బియ్యం కార్డు ఉండి అర్హత కలిగినా కొంతమంది పేర్లు జాబితాలో రాలేదని చెబుతున్నారు. దీనికి కారణం ఏమిటో తెలియని పరిస్థితి.

బాధ్యతల్లో బందీ

» కష్టాల కడలిలో పురుషులు
» బాల్యం నుంచి వృద్ధాప్యం వరకూ బాధ్యతలే
» ప్రతి 4 ఆత్మహత్యల్లో ముగ్గురు పురుషులే
» గోప్యత విషయంలో పురుషులకు మొండిచెయ్యి
» నేడు అంతర్జాతీయ పురుషుల దినోత్సవం

6

108ఉద్యోగుల ఆందోళన

» సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ వద్ద రిలే దీక్ష



వదర్లపాడులో మద్యం దుకాణం వద్దని ఆందోళన చేస్తున్న ప్రజలతో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ షేక్ రమేష్

మా గ్రామంలో మద్యం దుకాణం వద్దు..

కైకలూరు, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడతామని, మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దంటూ గ్రామస్థులు ఆందోళన నిర్వహించారు. సోమవారం కైకలూరు మండలం వదర్లపాడులో రైస్‌మిల్లు సమీపాన మద్యం దుకాణం ఏర్పాటు చేసేందుకు సన్నద్ధమయ్యారు. గ్రామస్థులు అక్కడకు చేరుకుని మూడు గ్రామాలకు కూడలి వద్ద మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు, మహిళలకు, విద్యార్థులకు ఇబ్బందులు కలుగుతాయన్నారు. గ్రామంలో మద్యం దుకాణం వద్దని గ్రామ పంచాయతీ తీర్మానం చేసిందని పేర్కొన్నారు. ఎక్సైజ్ సీఐ షేక్ రమేష్ అక్కడకు వచ్చి గ్రామస్థులకు సర్దిచెప్పబోగా ఒప్పుకోకపోవడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆందోళనలో సర్పంచ్ వి.లక్ష్మీనాగదేవి, గ్రామస్థులు పాల్గొన్నారు.

గ్రామ పెద్దలే.. విడాకులు మంజూరు చేసేశారు!

» కట్టుబాట్ల పేరుతో చేతుల్లోకి చట్టం..
» కొల్లేరులోని శ్రీపర్రులో ఘటన
» న్యాయం చేయాలంటూ కలెక్టర్, ఎస్పీని కలిసిన బాధితురాలు.. విచారణకు ఆదేశం

ఏలూరు రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కట్టుబాట్లు పేరుతో ఓ జంటను గ్రామ పెద్దలు విడదీసి చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఏకంగా విడాకులు ఇప్పించి కాగితాలు రాయించుకున్న ఘటన కొల్లేరులోని గ్రామంలో జరిగింది. ఇదేమని ప్రశ్నిస్తే బాధితురాలి కుటుంబసభ్యులను బెదిరిస్తూ చేపల చెరువులకు వాటా ఇవ్వబోమంటూ హెచ్చరికలు జారీ చేయడంతో న్యాయం చేయాలంటూ బాధితురాలు కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ కేపీఎస్ కిశోర్‌ను కలిసి సోమవారం వినతిపత్రాలు అందజేసింది. బాధితురాలు తెలిపిన వివరాలివి.. కైకలూరు మండలం చటకాయి గ్రామానికి చెందిన రిషితకు, ఏలూరు రూరల్ మండలం శ్రీపర్రుకు చెందిన ముంగర సుభాష్‌తో 2012లో వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇటీవల భార్యను సుభాష్ మానసికంగా వేధిస్తుండడంతో ఇద్దరి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. సుభాష్‌కు చేపల చెరువులు ఉన్నాయి. రిషిత విద్యావంతురాలు. ఈ క్రమంలో చటకాయి, శ్రీపర్రు గ్రామపెద్దలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని శ్రీపర్రులో గతనెల 21న సమావేశమై తమకు విడాకులు మంజూరు చేశారని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. ఇదేంటని ప్రశ్నిస్తే చటకాయలోని చేపలచెరువుల్లో వాటా ఇవ్వబోమని హెచ్చరికలు జారీ చేశారని, ప్రస్తుతం పిల్లలు తనవద్ద ఉండేలా, పెద్ద అయిన తర్వాత తండ్రి వద్ద ఉండేవిధంగా నిర్ణయించారని, పిల్లలు చదువుకు అయ్యేఖర్చు తానే భరించాలని, తనకు ఉన్న భూమి డాక్యుమెంట్స్ తాకట్టులో ఉండగా, భూమిని విడిపించి కొడుకు, కూతురి పేరుమీద రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని తీర్మానించి సంతకాలు చేయించుకున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. భర్తతో తాను విడాకులు కోరలేదని, గ్రామ పెద్దలపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలంటూ అధికారులను వేడుకుంటోంది. కాగా ఈ వ్యవహారంపై ఐసీడీఎస్ పీడీ పద్మావతిని విచారణ చేసి నివేదిక అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు.



ఏలూరులో కలెక్టరేట్ వద్ద రిలే దీక్ష చేపట్టిన 108 ఉద్యోగులు

108 ఉద్యోగుల ఆందోళన

- సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ వద్ద రిలే దీక్ష

ఏలూరు రూరల్/భీమవరం టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): 108 అంబులెన్స్ సిబ్బంది సోమవారం రిలే దీక్ష చేపట్టారు. 108 సర్వీసులోని ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కొద్దిరోజులుగా ఆందోళన చేపట్టినా ప్రభుత్వ అధికారులు పరిష్కరించకపోవడంతో కలెక్టరేట్ వద్ద సోమవారం ఒకరోజు రిలేదీక్షా నిర్వహించారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించని పక్షంలో నవంబరు 25 తరువాత సమ్మెకు వెళతామని 108 ఉద్యోగులు హెచ్చరించారు. సమ్మె కారణంగా ప్రజలకు కలిగిన అసౌకర్యానికి యాజమాన్యం, ప్రభుత్వ అధికారులు పూర్తి బాధ్యత వహించాలన్నారు. 108 అంబులెన్స్ వ్యవస్థను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. మూడు షిఫ్ట్‌ల్లో 8 గంటల పని విధానం అమలు చేయాలన్నారు. ప్రభుత్వ నియామకాల్లో వెయిటేజ్ మార్కులు అందించాలని వైద్య ఆరోగ్యశాఖలో ఈఎంటి పోస్టుల్లో 108లో పనిచేస్తున్న ఈఎంటీలను నియమించాలన్నారు. సహజ, ప్రమాద మరణం పొందిన ఉద్యోగి కుటుంబానికి రూ.25లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలని ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 108 వ్యవస్థను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని, ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, గత తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన జీవో ఎంఎస్ 49 ను పునరుద్ధరించాలని పలు అంశాలతో నిరశన వ్యక్తం చేశారు. అధ్యక్షుడు ఇబ్బా ప్రసాద్, కార్యదర్శి రమేష్, వర్కింగ్ అధ్యక్షుడు నారాయణమూర్తి, ఉపాధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరావు, శివ, తదితరులు పాల్గొన్నారు.



భీమవరం కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్షలో 108 అంబులెన్స్ ఉద్యోగులు

పట్టభద్రుల ఓటు నమోదు దరఖాస్తులను

బీఎల్‌వోలు ఇంటికెళ్లి పరిశీలించాలి

- సీఈవో వివేక్ యాదవ్

అమరావతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కృష్ణా- గుంటూరు, తూర్పు-పశ్చిమ గోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో ఓటర్లుగా నమోదయ్యేందుకు ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి పరిశీలించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్ యాదవ్ ఆదేశించారు. సోమవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఆన్‌లైన్‌లో సమర్పించిన సర్టిఫికెట్ల ఒరిజినల్స్‌ను పరిశీలించాలి. సరిగ్గా ఉన్నాయని తేలితే ఆమోదిస్తున్నట్లు, లేకపోతే తిరస్కరిస్తున్నట్లు సంతకం చేయాలి. నామినేషన్ల స్వీకరణ గడువుకు పది రోజుల ముందు వరకు ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చు. మహిళా ఓటర్ల విషయంలో కొన్ని సూచనలు కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసింది. ఆమేరకు వివాహం అయిన మహిళా ఓటర్ల ఇంటి పేరు విద్యా ధృవీకరణ పత్రాలతో సరిపోలకపోయినా దరఖాస్తు తిరస్కరించవద్దు' అని సీఈవో స్పష్టం చేశారు.

జాతీయ స్థాయి పోటీలకు ఏలూరు క్రీడాకారులు



ఎంపికైన బాస్కెట్‌బాల్ క్రీడాకారులు

ఏలూరు రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పంజాబ్ రాష్ట్రం పాటియాలాలో ఈనెల 20 నుంచి 26 వరకు జరిగే 68వ జాతీయ స్థాయి స్కూల్‌గేమ్స్ అండర్ -19 బాస్కెట్‌బాల్ పోటీలో పాల్గొనేందుకు ఏలూరుకు చెందిన ఐదుగురు క్రీడాకారిణులు ఎంపికయ్యారు. ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీల్లో అత్యంత ప్రతిభకనబరిచిన పి.జయశ్రీ, సాయి భవాని, దేవిశ్రీ, రుత్విక, పూజితలను జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక చేసినట్లు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి గవ్వా శ్రీనివాస్, ట్రెజరర్ కె.మురళీకృష్ణ, ఎస్.సాంబశివరావు అభినందించారు. జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులను పలువురు అభినందించారు.

తెన్నేటి కథల పుస్తకావిష్కరణ



గ్రంథాలయంలో పుస్తకావిష్కరణలో పాల్గొన్న కవులు

భీమవరం టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సాహితీవేత్త, అక్షర కిరీటి తెన్నేటి మాస్టారు తెన్నేటి కథలు స్వీయ కథల సంపుటి ఆవిష్కరణ భీమవరం ప్రథమ శ్రేణి జిల్లా శాఖ గ్రంథాలయంలో సోమవారం నిర్వహించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కలి గొట్ల గోపాలశర్మ మాట్లాడుతూ తెలుగుదనం, మన పల్లెలు, పెద్దల ఆలోచనా విధానాల ఇతివృత్తంగా సుమారు 33 కథలున్నాయని, ఇంత మంచి పుస్తకాన్ని ప్రచురించిన తెన్నేటి మాస్టారుకు అభినందనలు అన్నారు. గోదావరి సాహితీ ప్రభ ప్రధాన కార్యదర్శి చిర్రావూరి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మంచి సందేశాలతో కూడిన కథలను తెన్నేటి మాస్టారు ఈ తెన్నేటి కతలులో పొందుపరిచారన్నారు. పలువురు కవులు, తెలుగు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జీలకర్రగూడెం బౌద్ధారామాల ప్రాంతంలో సందర్శకుల రద్దీ

కిటకిటలాడిన బౌద్ధారామాలు

కామవరపుకోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జీలకర్రగూడెం బౌద్ధారామాల వద్ద కార్తీక సోమవారం గట్టు తీర్థం జరిగింది. బౌద్ధారామాలు, బౌద్ధ కట్టడాలు, ఆరామాలు, ప్రాచీన కట్టడాలను అధిక సంఖ్యలో ప్రజలు సందర్శించారు. వన భోజనాలు కూడా ఏర్పాటు చేసుకున్నారు. ఎస్ఆర్ఐ గోరుముచ్చు గోపాల్ యాదవ్ భక్తులకు అల్పాహారాలను ఏర్పాటు చేశారు. తడికలపూడి పోలీసులు తగు భద్రత చర్యలు చేపట్టారు. జిల్లా నలుమూలల నుంచి సందర్శకులు తరలిరావడంతో బౌద్ధారామాల ప్రాంతమంతా కిటకిటలాడింది.



ప్రత్యేక అలంకరణలో గునుపూడి సోమేశ్వరుడు



ఆచంటేశ్వరుడికి అభిషేకం



పట్టిసం వీరేశ్వరస్వామికి అభిషేకం



క్షీరా రామలింగేశ్వరుడికి అభిషేకం



భీమవరంలో కోటిదీపోత్సవం

హర హర మహాదేవ



అఖండ జ్యోతికి నెయ్యి సమర్పిస్తున్న భక్తులు

- భక్తుల శివ నామస్మరణతో మార్మోగిన శైవ క్షేత్రాలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పంచారామాలు కిటకిట



గునుపూడి సోమేశ్వరాలయ క్యూలైన్లలో భక్తుల రద్దీ

పాలకొల్లు అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): శివ నామస్మరణతో శైవ క్షేత్రాలు మార్మోగాయి. కార్తీక సోమవారం శివాలయాల్లో ప్రత్యేక పూజలు, రాత్రి కోటి దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. పంచారామ క్షేత్రం క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిట కిటలాడింది. వేకువజాము నుంచి భక్తుల ఓం నమశివాయ ఘోషతో ఆలయం మార్మోగింది. పలు రాష్ట్రాల నుంచి పంచారామ క్షేత్రాల పేరుతో వివిధ వాహనాల్లో సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్టు అంచనా. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు, సూపరిండెంటెంట్ వాసు, ఎంఎస్ స్వామి, సిబ్బంది పర్యవేక్షించారు. పట్టణంలో పంచారామ క్షేత్రాల పేరుతో వచ్చిన వాహనాలతో రద్దీగా మారింది. పట్టణ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

- భీమవరం టౌన్: గునుపూడి సోమేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఇతర ప్రాంతాల నుంచి పంచారామ బస్సులల్లో భారీగా తరలివచ్చారు. క్యూలైన్‌లు భక్తులతో కిటకిటలాడాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రతతో భక్తులు ఇబ్బంది పడ్డారు. ఉచిత దర్శనం, రూ.50, రూ.100, రూ.200 క్యూలైన్‌లు నిండిపోయాయి. తెల్లవారుజామున ఆలయ అర్చకుడు చెరుకూరి రామకృష్ణ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించి దర్శనం కల్పించారు. పంచారామ బస్సుల్లో ప్రైవేట్ వాహనాలు, సొంత వాహనాలతోపాటు ఆర్టీసీ ఏర్పాటుచేసిన పంచారామాలల్లోకూడా భక్తులు తరలి వచ్చారు. తెలంగాణ డిపోల నుంచి కూడా బస్సులు వచ్చాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవాదాయధర్మదాయశాఖ ఇనస్పెక్టర్ వి వెంకటేశ్వరరావు, ఈవో రామకృష్ణంరాజు, కాళ్ళకూరు ఈవో అరుణ్‌కుమార్, డీవీ.కృష్ణంరాజు పర్యవేక్షించారు. వన్‌టౌన్ సీఐ నాగరాజు బందోబస్తును పర్యవేక్షించారు.
- ఆచంట: శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజామునే పుణ్యస్నానాలు ఆచరించి అనంతరం గోదావరి కాలువ, చెరువుల్లో కార్తీక దీపాలు వెలిగించారు. ఆచంటేశ్వరుని ఆలయం వేకువజాము నుంచి సాయంత్రం వరకు భక్తుల శివనామస్మరణతో హోరెత్తింది. భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ ఆవరణలో అఖండ జ్యోతికి పలువురు భక్తులు ఆవు నెయ్యి సమర్పించారు. స్వామి వారి దర్శనం కోసం భక్తులు క్యూ కట్టారు. భక్తులకు ఆలయ ఈవో ఆదిమూలం వెంకట సత్యనారాయణ, గజేశ్వరరావు, సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.
- పోలవరం: హరోం హర హర హర మహాదేవ శంభో శంకర అంటూ శివ నామ స్మరణతో పట్టిసీమ శివక్షేత్రం మార్మోగింది. దేవకూట పర్వతం భక్తుల శివ నామస్మరణతో పులకించింది. వేలాది మంది భక్తులు వచ్చి పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిని దర్శించి పూజలు చేశారు. తెల్లవారుజామునే పట్టిసీమ చేరుకున్న భక్తులు గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి దీపాలు వదిలారు. శివక్షేత్రంలో ఏకవార రుద్రాభిషేకం, భస్మాభిషేకం, బిల్వపత్ర అర్చన, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. సుమారు ఐదువేల మంది భక్తులు దర్శనానికి వచ్చినట్లు ఈవో చాగంటి సురేష్ నాయుడు తెలిపారు. లాంచీలు ఎక్కి దిగే ప్రాంతాలలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



పురుషులతో పాటు మహిళలకు సమానత్వం పాటించాలి, మహిళలను గౌరవించాలనే ఉపన్యాసాలు సాధారణం. నిజంగా పురుషులకు అన్ని అవకాశాలున్నాయా..? గౌరవాలు దక్కుతున్నాయా..? వివక్ష లేదా..? సమస్యలు లేవా అంటే..? ఎంత మంది కచ్చితమైన సమాధానం చెప్పగలరు. అవును సగటు పురుషుడు బాధ్యతల బందీ అయ్యాడనేది వాస్తవం. మహిళలతో పాటు పురుషుడు కూడా సమస్యలు ఎదుర్కొంటున్నారనేది వాస్తవం. మహిళ ప్రత్యేకతను చాటే మహిళా దినోత్సవం 1911లోనే రూపుదిద్దుకుంది. అలాగే పురుష దినోత్సవం కూడా ఉండాలనే ఆలోచన బయలుదేరింది. దీనికి 90వ దశకంలో ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఇంటర్నేషనల్ మెన్స్‌డే (ఐఎండీ) ఏటా నవంబరు 19న ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నారు. నేడు ప్రపంచ పురుషుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

\- పాలకొల్లు

బాధ్యతల్లో బందీ

నేడు అంతర్జాతీయ పురుషుల దినోత్సవం



- కష్టాల కడలిలో పురుషులు
- బాల్యం నుంచి వృద్ధాప్యం వరకూ బాధ్యతలే
- ప్రతి 4 ఆత్మహత్యల్లో ముగ్గురు పురుషులే
- ప్రతి 3 హింసాత్మక సంఘటనల్లో ఇద్దరు పురుషుల మృతి
- గోప్యత విషయంలో పురుషులకు మొండిచెయ్యి
- స్త్రీ హక్కులతో సమానంగా పురుషులకు ఉండాలి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 20- 50 మధ్య వయస్కులు సుమారు 8లక్షల మంది ఉన్నారు. జిల్లాలో పురుషుల వివక్షతకు వస్తే ముఖ్యంగా వైవాహిక జీవితాలకు సంబంధించి భార్యభర్తల తగాదా కేసులు జిల్లా వ్యాప్తంగా నిత్యం పదుల సంఖ్యలో నమోదవుతున్నాయి. విచిత్రం ఏమిటంటే ఒకప్పుడు వరకట్నం వేధింపులు గృహహింస, ఇతరతరా ఇబ్బందులతో మహిళలు ఎక్కువగా ఆత్మహత్యలకు పాల్పడేవారు. ఇప్పుడు ఆత్మహత్యలను పరిశీలిస్తే ప్రతీ నాలుగు ఆత్మహత్యలలో ముగ్గురు పురుషులే ఉంటున్నారు. ప్రతీ మూడు హింసాత్మక ఘటనలలో ఇద్దరు పురుషులు బలి అవుతున్నారు. కుటుంబ నేపథ్యంలో అనేక సందర్భాలలో పురుషులే నష్టపోతున్నారు. ముఖ్యంగా భార్యభర్తల వివాదాల్లో భార్య పోలీస్‌స్టేషన్, న్యాయస్థానాలను ఆశ్రయిస్తే వాస్తవం ఏదైనా ముందుగా భర్త తోబుట్టువులు తల్లిదండ్రులు జైలు పాలవుతున్నారు. ఈకారణంగా పురుషుల ఇబ్బందులు ముఖ్యంగా వివాహిత పురుషులు ఎదుర్కొంటున్న కష్టాలపై ఇటీవల జిల్లాల వారీగా భార్యా బాధిత సంఘాలు వెలుస్తున్నాయి. ఈపరిస్థితుల్లో 90వ దశకంలో పురుషుల దినోత్సవం ఏర్పాటుకు రూపకల్పన జరిగింది. ఇప్పటికే అంతర్జాతీయ మహిళా దినోత్సవం, పితృదినోత్సవం జరుపుకుంటున్నప్పటికీ పురుషులకంటూ ఒక దినోత్సవం లేకపోవడం పురుషుల దినోత్సవ ఆలోచనకు దారి తీస్తుంది.

పురుషుల దినం ప్రాథమిక లక్ష్యాలు

ఈ దినోత్సవం ప్రాథమికి లక్ష్యం ఆదర్శ పురుషులను గుర్తించడం. కేవలం సినీ తారలను క్రీడాకారులను మాత్రమే కాకుండా కాయకష్టం చేసుకున్నవారైనా గౌరవప్రదమైన పురుషుల కంటే సంఘానికి కుటుంబానికి వైవాహిక వ్యవస్థ, శిశు సంరక్షణకు పురుషుల ఒనగూర్చిన ప్రయోజనాలను చెప్పడం పురుషుల సాంఘిక, భావోద్వేగ, శారీరక ఆధ్యాత్మిక ఆరోగ్యంపై దృష్టి సారించడం, చట్టాలలో పురుషుల ఎదుర్కొంటున్న వివక్షతను చాటడం స్త్రీ పురుషుల మధ్య సఖ్యత సంబంధాలను నెలకొల్పడం, లింగ సమానత్వం వ్యాపింప చేయడం పురుషుల దినోత్సవం ప్రాధాన్యాంశాలు

పురుషులు పడుతున్న ఇబ్బందులు

వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యుహెచ్‌వో) అంచనా ప్రకారం 45 ఏళ్ల కంటే తక్కువ వయస్సు పురుషుల మరణాలకు ఆత్మహత్యలే ప్రధాన కారణంగా తేలింది. విద్యాపరంగా వెనుకబడుతున్నారు. అనేక మంది పురుషులు నిరాధార ఆరోపణలతో జైలు పాలవుతున్నారు. పురుషులు వివక్షకు గురవుతున్నారు.

గోప్యత విషయంలో..

అత్యాచారాలు లేదా గృహ హింస వంటి దాడుల కేసులలో అరెస్ట్ అయిన పురుషులను ప్రచార మాధ్యమాలు వేలెత్తి చూపుతూ అవసరం కంటే ఎక్కువ ప్రచారం చేస్తున్నాయి. స్త్రీల విషయానికి వస్తే బాధితుల పేర్లను సైతం గోప్యంగా ఉంచుతున్నారు. పురుషుల విషయానికి వస్తే మితిమీరిన పబ్లిసిటీ ఇస్తున్నారు. విశేషం ఏమిటంటే ఈ తరహా కేసులలో అధిక శాతం కొట్టివేయబడుతున్నాయి. పురుషులు నిర్దోషులుగా బయటకు వస్తున్నారు. కానీ జరగాల్సిన నష్టం జరిగిపోతుంది.

1999 నవంబరు 19

ట్రినిడాడ్ టొబాగో దేశస్థులు మొదట పురుషుల దినోత్సవానికి ఊపిరి పోశారు. దక్షిణ ఐరోపాకు చెందిన మాల్టా దీవిలో 1994 ఫిబ్రవరి 7 నుంచి జరుపుతున్నారు. 1999 నవంబరు 19 నుంచి ప్రపంచ వ్యాప్తంగా పురుషుల దినోత్సవం జరుపుతున్నారు.

సమాన హక్కులు ఉన్నాయా..?

నేడు స్త్రీలతో పాటు పురుషులకు సమాన హక్కులు కొన్ని సందర్భాలలో దక్కడం లేదు. సమాజంలో మహిళలకు బలం లేనప్పటికీ చట్టంలో బలం ఉండటంతో కొన్ని సందర్భాలలో పురుషులు తప్పు చేయకుండానే శిక్షను అనుభ విస్తున్నారు. ఇటీవల ఒక మాజీ ప్రజాప్రతినిధిపై కేసు పెట్టిన మహిళ మరలా అతను నిర్దోషి అని హైకోర్టు తెలిపారు. ఇటీవల పలువురు పురుష సెలబ్రెటీలు పైనా కేసులు నమోదవుతున్నాయి. విచిత్రం ఏమిటంటే ఎప్పుడో 10- 20 సంవత్సరాలు క్రితం సంబంధిత పురుషుల వలన నష్టపోయానంటూ కేసులు పెడుతున్నారు. ఇలా అనేక సందర్భాలలో పురుషులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

హనీ ట్రాప్.. దొంగ పెళ్లిళ్లు..!



- ఇటీవల పాలకొల్లు మండలంలోని ఒక యువకుడికి 30 దాటినా వివాహం కాకపోవడంతో ఎనిమిదేళ్ల వయస్సు కొడుకు ఉన్న డైవోర్సీ మహిళను వివాహమడారు. వివాహమైన 3 నెలలు పాటు ఉన్న ఆమె నా భర్తకు మగతనం లేదంటూ ఆరోపించి అతడి నుంచి లక్షలాది రూపాయలు గుంజేసింది.
- పాలకొల్లు మండలానికి చెందిన మరో వివాహితుడిని ఒక వివాహిత మహిళ హనీ ట్రాప్‌లోకి దింపి రూ.2కోట్లు ఆస్తిని కాజేసింది.
- పాలకొల్లు పట్టణానికి చెందిన మరో కేసులో డైవర్సీ అయిన వివాహిత మరొకరిని పెళ్లి చేసుకుని చుక్కల చూపించింది. అనేక కేసులలో పురుషులు బాధితులుగా మిగిలుతున్నారు.

ఇటీవల ఉమ్మడి జిల్లాలో న్యాయవాదులను ఆశ్రయిస్తున్న విడాకుల కేసులలో మూడింట రెండు వంతులు పురుష బాధితులే ఉంటున్నారని న్యాయవాదులు చెబుతున్నారు. మొత్తంగా పురుషులు బాల్యంలో నీకేంట్రా నీవు మగాడివిరా అనే తల్లి మాటలతో మొదలుకొని వృద్ధాప్యంలో జీవితం చరమాంకం వరకూ బాధ్యతలను మోస్తూ యోగి వేమన చెప్పినట్లు కష్టాలను ఎదుర్కొంటూనే పుణ్య పురుషులుగా మిగులుతున్నారు.



- వాస్తవానికి 1960లోనే రష్యాలో పురుషుల దినోత్సవం ప్రతిపాదన జరిగింది. 1968లో అమెరికాకు చెందిన జాన్ బీహరీస్ అనే విలేకరి పురుషులకు ఒక దినోత్సవం లేకపోవడంపై ప్రశ్నించారు. సామ్యవాద వ్యవస్థలో లింగ అసమానత ఒక తీరనిలోటుగా ఆయన తాను రాసిన వ్యాసంలో ప్రస్తావించాడు. సామ్యవాద వ్యవస్థ స్త్రీ పురుషులు ఇద్దరికీ సమాన హక్కులు ఇచ్చినా పురుషుల కంటె స్త్రీలకు సమానత్వం ఇచ్చినట్లు అనిపిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. కుటుంబం కోసం పురుషులు రెక్కలు ముక్కలు చేసుకొని కష్టపడుతున్నప్పటికీ వారిని గుర్తించడానికి ఒక్కరోజు కూడా లేని విషయాన్ని హారస్ ప్రస్తావించాడు.
- అంతర్జాతీయ పురుషుల దినోత్సవం ఎందుకు అవసరమనేది ఆయన విశ్లేషించారు. మహిళలకు 1911లోనే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని రూపకల్పన చేశారు. పురుషుల దినోత్సవం జరుపుకోడానికి 80 ఏళ్లు వెనుకబడ్డారు.
- 1999లో తొలిసారిగా అంతర్జాతీయ పురుషుల దినోత్సవం నిర్వహించారు. లింగ వివక్షతలో కొన్ని నేపథ్యాలలో పురుషులు ముఖ్యంగా 20-40 వయస్సు పురుషులు అధిక శాతం ఇబ్బందులు పడుతున్నారు.

'అపార్' నమోదు త్వరగా పూర్తి చేయాలి

ఎంఈవోలకే ఎస్జీటీల సెలవు మంజూరు అధికారం : కలెక్టర్ వెట్రి సెల్వి

ఏలూరు అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల సమగ్ర డేటా కోసం చేపట్టిన 'అపార్' నమోదును త్వరగా పూర్తిచేయాలని ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి విద్యాశాఖాధికారులను ఆదేశించారు. సోమవారం ఎంఈవోలు, డీవైఈవోలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పలు విద్యా సంబంధిత అంశాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అపార్ నమోదులో వెనుకబడివున్న జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు, అగిరిపల్లి తదితర మండలాల ఎంఈవోలు ఉద్యోగ బాధ్యతలను సీరియస్‌గా తీసుకోకపోతే ఎలా అని ప్రశ్నించారు. అపార్ డేటా నమోదుకు అవసరమైన ఆధార్ కార్డుల్లో సవరణలకు జిల్లాలో మండలాల వారీగా ఎక్కువమంది విద్యార్థులున్న ఉన్నత పాఠశాలల్లోనే ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి జడ్పీ సీఈవోకు తెలియజేయాలని ఆదేశించారు. ముఖ్యంగా అన్ని పాఠశాలల్లో ఎఫ్ఏ-1, 2 (ఎస్ఏఎంపీ) పరీక్షల మార్కుల నమోదు శనివారంలోగా పూర్తి చేయకపోతే సంబంధిత ఎంఈవోలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. టీచర్ల సెలవులపై సమీక్షిస్తూ హైస్కూళ్లలో ప్రధానోపాధ్యాయునికి టీచర్లు పెట్టే సీఎల్ మంజూరు అధికారాలున్నట్టుగానే, ఇకమీదట మండలంలోని సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్జీటీ) క్యాజువల్ సెలవులకు ఎంఈవో అనుమతి తప్పనిసరి అని, ఈ నిర్ణయాన్ని తక్షణమే జిల్లావ్యాప్తంగా అమలు చేయాలని ఆదేశించారు. మండలం యూనిట్‌గా ఎస్జీటీల క్యాజువల్ లీవులు రోజుకు 8 నుంచి 10 శాతం దాటకూడదని స్పష్టం చేశారు. ఎక్కువమంది విద్యార్థులు మధ్యాహ్న భోజన పథకాన్ని వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఎంఈవోలదేనన్నారు. పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న బాల బాలికలకు ఉన్నత పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు తప్పనిసరిగా తీసుకోవాల్సిందేనని ఆదేశించారు. సమావేశంలో సమీక్షించిన అన్ని అంశాలపై జారీచేసిన ఆదేశాల అమలును వారం రోజుల్లో మరో దఫా సమీక్షిస్తానని, అప్పటికీ ఎటువంటి ప్రగతి కనబరచకపోతే సంబంధిత ఎంఈవోలపై చర్యలు తప్పవని హెచ్చరించారు.


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ మధుసూదనరెడ్డి, తదితరులు

దేశ రక్షణ వ్యవస్థలో 'డీఆర్డీవో' కీలకపాత్ర

తాడేపల్లిగూడెం అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : దేశ రక్షణ వ్యవస్థలో డీఆర్డీవో కీలక పాత్ర పోషిస్తుందని భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్డీవో) శాస్త్రవేత్త, డిఫెన్స్ మెటలర్జికల్ రీసెర్చ్ లేబరేటరీ పూర్వపు డైరెక్టర్ డాక్టర్ జి.మధుసూదనరెడ్డి అన్నారు. సోమవారం తాడేపల్లిగూడెంలోని ఏపీ నిట్‌లో ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎన్‌వీ.రమణారావు, డాక్టర్ రఫీమహ్మద్ సహకారంతో 'డీఆర్డీవో పరిశోధనలకు నిధుల సమీకరణ, అవకాశాలు' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ పరిశోధనా రంగాల్లో భారత్ స్వావలంబన సాధించే దిశగా అడుగులు వేస్తుందన్నారు. డీఆర్డీవో ఏరోనాటిక్స్ ఆయుధాలు, ఎలక్ట్రానిక్స్ పరికరాలు, తేలికపాటి యుద్ధ విమానాలు, రాడార్లు, క్షిపణులు, రాకెట్ల పరికరాలు స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేస్తుందన్నారు. భారత్‌ను ప్రపంచంలోనే మూడో ఆర్థిక వ్యవస్థగా రూపొందించేందుకు యువత ముందుకు రావాలన్నారు. అనంతరం మధుసూదనరెడ్డిని ఆచార్యులు ఘనంగా సత్కరించారు. డీన్‌లు డాక్టర్ జీఆర్కే శాస్త్రి, డాక్టర్ ఎన్.జయరాం, డాక్టర్ టి.కురుమయ్య, డాక్టర్ జీబీ.వీరేష్‌కుమార్, అసోసియేట్ డీన్ డాక్టర్ వి.సందీప్, డీఆర్‌డీవో శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ అల్లా భక్షు, ఆచార్యులు సత్యప్రసాద్, డాక్టర్ సునీల్‌కుమార్, డాక్టర్ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

ఉద్యోగ, టీచర్లకు పీఆర్సీ, డీఏలు వచ్చేలా కృషిచేస్తా

టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థి నారాయణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి నారాయణరావు

ఏలూరు అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీ అమలు, డీఏలు సకాలంలో అందేలా కృషిచేస్తానని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి గంధం నారాయణరావు అన్నారు. ఆయన అభ్యర్థిత్వానికి మద్దతు ప్రకటించిన ఏపీటీఎఫ్, తదితర సంఘాల నాయకులతో కలిసి సోమవారం స్థానిక ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులకు నష్టం చేకూరుస్తున్న జీవో 117 ఉత్తర్వుల రద్దుకు శాసన మండలిలో ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన అభ్యర్థిత్వానికి ఎస్టీయూ, ఏపీటీఎఫ్, బీటీఏ, పీఆర్టీయూ, ప్రైవేటు విద్యా సంస్థల ఉపాధ్యాయులు, అధ్యాపకుల మద్దతు ఉందని తెలిపారు. అనంతరం ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి, నాయకులు సాల్మన్‌రాజు, రెడ్డిదొర మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై మండలిలో ఉద్యమవాణిని వినిపించగల సత్తా ఆయనకు ఉందన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా, తూర్పు గోదావరి జిల్లా శాఖల నాయకులు ప్రకాష్, నారాయణ, దుర్గారావు, సబ్ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.



కవి కనకదాస చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ గోపాల్, తదితరులు

ఘనంగా కనకదాస జయంతి వేడుకలు

తాడేపల్లిగూడెం రూరల్ నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కనకదాస కవి, భక్తుడు మాత్రమే కాదని ఆయన కుల వ్యవస్థకు వ్యతిరేకంగా ఎన్నో కీర్తనలు రాశారని ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ బి.గోపాల్ పేర్కొన్నారు. వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో కనకదాస జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కనకదాస చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కన్నడంలో తన భక్తి రచనల ద్వారా సామాజిక సమానత్వం, ఆధ్యాత్మికతను ప్రోత్సహించారన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, వర్సిటీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక పక్కన మద్యం షాపు వద్దు

కలెక్టర్‌కు గొల్లలకోడేరు దళిత వాసుల వినతి

పాలకోడేరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గొల్లలకోడేరు దళితవాడకు చేర్చి ఉన్న శ్మశాన వాటికలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని గ్రామస్థులు కోరారు. సోమవారం తొలుత గ్రామంలో శ్మశాన వాటిక వద్ద మద్యం షాపు ఏర్పాటు చేయొద్దని నినాదాలు చేశారు. అనంతరం భీమవరం వచ్చి పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణికి వినతిపత్రం అందజేశారు. తాడేపల్లిగూడెం నుంచి భీమవరం వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిని చేర్చి ఉన్న శ్మశాన వాటిక వద్ద మద్యం దుకాణం ఏర్పాటు చేయడం పట్ల దళితకాలనీ వాసులు కొన్నిరోజులుగా అధికారులకు విన్నవిస్తూ వస్తున్నారు. దీనిలో భాగంగానే సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వల్ల అటుగా వెళ్లే మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, తీవ్ర ఇబ్బందులుపడాల్సి వస్తుందన్నారు. మద్యం దుకాణం ఏర్పాటు చేయకుండా చూడాలని ఆమెను కోరారు. సంఘ సభ్యులు పాల్గొన్నారు.

టీచర్లకు ఇక నెలవారీ

'పని సర్దుబాటు' ?!



- ఏ నెలకానెల విద్యార్థుల ఎన్‌రోల్‌మెంటే ప్రామాణికం
- హెచ్చుతగ్గుల ఆధారంగా సర్‌ప్లస్, డిప్యుటేషన్లు !

ఏలూరు అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): టీచర్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్‌ను ఇక మీదట నెలవారీగా చేపట్టడానికి కొత్త విధానానికి విద్యాశాఖ తెరతీసింది. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే ఉపాధ్యాయులు ఏ స్కూలులో పనిచేస్తున్నామో లేదా తదుపరి నెలలో ఏ స్కూలులో పనిచేయాల్సి ఉంటుందోననే గందరగోళానికి గురికావడం ఖాయమని చెప్పవచ్చు. వాస్తవానికి ఏడాదికో మారు విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌కు కటాఫ్ తేదీని ప్రామాణికంగా తీసుకుని, టీచర్:విద్యార్థుల సంఖ్య నిష్పత్తి ఆధారంగా ఆయా స్కూళ్ళ సబ్జెక్టుల్లో మిగులు (సర్‌ప్లస్) టీచర్లను గుర్తించి, వారిని కొరతవున్న పాఠశాలలకు తాత్కాలికంగా డిప్యుటేషన్లపై సర్దుబాటు (వర్క్ అడ్జస్ట్‌మెంట్) చేసే విధానం ఇప్పటివరకు అమల్లోఉంది. తాజాగా జారీ అయిన మౌఖిక ఆదేశాల ప్రకారం ఇకనుంచి ఆయా పాఠశాలల్లో ప్రతీనెలా 30వ తేదీ నాటి విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను ప్రామాణికంగా తీసుకుని సర్‌ప్లస్ టీచర్లను గుర్తించి, ఆ వెంటనే వారిని కొరతవున్న పాఠశాలలకు సర్దుబాటు చేయడానికి కసరత్తు జరుగుతోంది. నెలవారీ సర్దుబాట్ల నిబంధనలకు విరుద్ధం కావడంతో ఈ విషయమై లిఖితపూర్వకంగా ఎక్కడా ఉత్తర్వులు లేకుండా, ఎవరూ న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం లేకుండా ఉండేందుకు కేవలం మౌఖిక సమాచారంతోనే ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది.

'అపార్' డేటా లోటుపాట్లతో టీచర్లకు 'మిగులు' భయం



ప్రస్తుతం అన్ని పాఠశాలల్లో విద్యార్థుల సమగ్ర డేటాను 'అపార్' పేరిట నమోదు చేస్తున్న విషయం తెలిసిందే. జిల్లాలో ఇటీవల వరకు దాదాపు 80 శాతం విద్యార్థుల 'అపార్' డేటా పూర్తయిందని కొద్దిరోజుల క్రితమే డీఈవో వెంకటలక్ష్మమ్మ ప్రకటించారు. కాగా మిగతా విద్యార్థుల డేటాను 'అపార్'లో చేర్చడానికి పుట్టిన తేదీలు, ఆధార్‌లో సవరణలు, పేర్లలో సవరణలు తదితర సమస్యలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో సమగ్ర వివరాలు లేని విద్యార్థుల డేటాను అపార్‌లో నమోదు చేసేందుకు అవకాశం లేకపోవడంతో, అటువంటి విద్యార్థులను స్కూలు డ్రాప్‌బాక్స్‌లో కొందరు స్కూలు ప్రధానోపాధ్యాయులు వేస్తున్నారు. దీంతో సంబంధిత విద్యార్థుల పేర్లు స్కూలు యు-డైస్ డేటాలో కనబడవు. వాస్తవానికి డ్రాప్‌బాక్స్‌లో వేసిన విద్యార్థులు భౌతికంగా అదే స్కూలులో ఉన్నప్పటికీ, ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకునే యు-డైస్‌లో సంబంధిత విద్యార్థి పేరు లేకపోతే ఆ విద్యార్థి మరోచోటకు వెళ్ళిపోయినట్టుగానే పరిగణిస్తారని చెబుతున్నారు. ఇలా చాలా పాఠశాలల్లో 'అపార్' ప్రతిష్టంభనల వల్ల విద్యార్థులను స్కూలు డ్రాప్‌బాక్స్‌లో వేసినప్పటికీ, వారంతా భౌతికంగా అదే స్కూలులోనే ఉంటున్నారు. తాజాగా నెలవారీ వర్క్ అడ్జస్ట్‌మెంట్‌కు స్కూలు యు-డైస్ డేటానే విద్యాశాఖ ప్రామాణికంగా తీసుకుంటుండంతో కొత్తగా సర్‌ప్లస్ టీచర్ల ఆవిర్భానికి కారణమవుతోందని భావిస్తున్నారు. నెలవారీ వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో సర్‌ప్లస్‌గా గుర్తించిన టీచర్లను కొరతవున్న పాఠశాలలకు సర్దుబాటు చేసిన తర్వాత, మరుసటి నెలలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెరిగితే ఆ టీచరును మళ్లీ వెనక్కిపంపించే అవకాశంలేదని తెలిసింది. ఇతర పాఠశాలల్లో మిగులు ఉపాధ్యాయుల నుంచి కొరతవున్న స్కూలుకు డిప్యుటేషన్‌లపై సర్దుబాటు చేస్తారు. అపార్ నమోదుకు ఈ నెలాఖరువరకు గడువు ఉంది. తర్వాత మరికొంతకాలం పొడిగించే అవకాశమూ లేకపోలేదు. అపార్‌కు ఆటంకంగా వున్న సమస్యలను పరిష్కరించలేని పరిస్థితుల్లో పలువురు విద్యార్థులను స్కూలు డ్రాప్‌బాక్స్‌లో వేస్తున్న నేపథ్యంలో ఇప్పుడు చేపడుతున్న టీచర్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్‌కు యు-డైస్‌ను ప్రామాణికంగా తీసుకుంటుండడం ఉపాధ్యాయులకు తీరని నష్టమేనని భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

వర్క్ అడ్జస్ట్‌మెంట్‌పై అభ్యంతరాల అవకాశం ?

ఏడాదికోసారి మాత్రమే చేపట్టే మిగులు టీచర్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్‌ను నెలవారీగా మార్చుతుండడంపై అభ్యంతరాలు వచ్చే అవకాశం ఉంది. ఈ ఏడాది ఆగస్టులో జిల్లాలో చేపట్టిన వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో 805 మంది సర్‌ప్లస్ టీచర్లను గుర్తించగా, వీరిలో 511 మందిని కొరతవున్న స్కూళ్ళకు సర్దుబాటు చేయగలిగారు. ఇక నెలవారీ వర్క్ అడ్జస్ట్‌మెంట్‌కు ప్రభుత్వం వద్ద వున్న యు-డైస్ డేటాలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ హెచ్చు తగ్గులను ప్రామాణికంగా ఏ నెలకా నెల తీసుకుని నేరుగా డైరెక్టరేట్ నుంచే సర్‌ప్లస్ టీచర్లను గుర్తించి కొరతవున్న పాఠశాలలకు డిప్యుటేషన్లు వేస్తూ సంబంధిత జిల్లా డీఈవో పేరిట ఉత్తర్వులు జారీచేస్తారని తెలిసింది. ఇటీవల వరకు ఇటువంటి డిప్యుటేషన్లను స్థానికంగా వున్న కొరత, నెలవారీ రిటైర్మెంట్ల వేకెన్సీలను భర్తీ చేసేందుకు సంబంధిత మండలాల ఎంఈవోలే వేసుకునేందుకు వెసులుబాటు ఉండగా ఇపుడు ఆ విధానాన్ని రద్దుచేసి నేరుగా డైరెక్టరేట్‌నుంచే తాత్కాలిక నియామకాలు చేపట్టడానికి రంగం సిద్ధం చేసినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో గత గురువారం వెలువడిన మౌఖిక ఆదేశాలు అమలు జరిగేలా నెలవారీ సర్దుబాట్ల ప్రక్రియలో సర్‌ప్లస్‌గా గుర్తించిన టీచర్లను త్వరలోనే డిప్యుటేషన్లు వేయనున్నట్టు సమాచారం. దీనిపై అధికారికంగా లిఖితపూర్వక ఉత్తర్వులేవీ లేకపోవడం గమనార్హం.

రెండు గంటల్లోనే ముంబై వెళ్లొచ్చు !

- రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్ట్ ఆక్యుపెన్సీ పెంపు
- విమానాశ్రయ అభివృద్ధికి రూ.250 కోట్ల కేటాయింపు
- డిసెంబరు 1 నుంచి ముంబైకి..
- 12 నుంచి ఢిల్లీకి సర్వీసులు
- 180 సీటింగ్‌తో విమానాల రాకపోకలు

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)
రాజమహేంద్రవరం విమానాశ్రయ అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. ఇక్కడి నుంచే దేశవ్యాప్త రాకపోకలకు సన్నద్ధం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాజమహేంద్రవరం విమానాశ్రయ అభివృద్ధికి సుమారు రూ.250 కోట్లు కేటాయించడంతో విమానాశ్రయ రూపురేఖలే మారిపోనున్నాయి. పనులు పూర్తయ్యేలోపు రాకపోకలను పెంచే యోచనలో ఉన్నారు. ఎక్కడికైనా ఇక్కడి నుంచి వెళ్లేలా విమానాశ్రయాన్ని సన్నద్ధం చేస్తున్నారు. ఇప్పటివరకూ 72 సీట్లతో విమానాలు నడుస్తున్నాయి. ఇక డిసెంబరు ఒకటి నుంచి 180 సీట్లు ఉన్న ఎయిర్‌బస్సులు రాకపోకలు సాగించనున్నాయి. ఇప్పటికే టికెట్లు విక్రయిస్తున్నారు. ఒకటో తేదీ నుంచి రాజమహేంద్రవరం టు ముంబైకి 180 సీట్లతో రోజుకు రెండు ఇండిగో ఎయిర్‌బస్సులు రాకపోకలు సాగించనున్నాయి. అదేనెల 12వ తేదీ నుంచి ఢిల్లీకి రెండు ఇండిగో ఎయిర్‌బస్సులు అటూ తిరుగుతాయి. ఒకటో తేదీ సాయంత్రం 4.50కి ముంబై నుంచి బయలుదేరి 6:45 గంటలకు రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటుంది. రాజమహేంద్రవరంలో రాత్రి 7.15 గంటలకు ఎయిర్‌బస్సు బయలు దేరి రాత్రి 9.50 గంటలకు ముంబై ఎయిర్‌పోర్టుకు చేరుతుంది. మొత్తం ప్రయాణ సమయం 2.10 గంటలు. మరో ఎయిర్‌బస్ డిసెంబరు 12వ తేదీన ఢిల్లీలో ఉదయం 7.30 గంటలకు బయలుదేరి 9.45 గంటలకు రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకుంటుంది. రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టులో ఉదయం 10.30 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం ఒంటి గంటకు ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు చేరుతుంది. ఈ రెండు ఎయిర్ బస్సుల్లో 180 మంది చొప్పున ప్రయాణికులు వెళ్లవచ్చు.

ఇప్పటివరకు రాజమహేంద్రవరంలోని మధురపూడి విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు రోజూ అటూ ఇటూ 14 సర్వీసులు తిరుగుతున్నాయి. బెంగళూరుకు నాలుగు సర్వీసులు ఉన్నాయి. చైన్నైకు ఒకసారి వెళ్లి వస్తోంది. గతంలో విశాఖ నుంచి సర్వీసు ఉండేది. కానీ రోడ్డుమార్గాన మూడు గంటల్లో వచ్చేస్తుండడంతో ఎక్కువ మంది విమానం ఎక్కడానికి ఇష్టపడకపోవడంతో రద్దయింది. ప్రయాణికులు పెరిగితే అక్కడ నుంచి కూడా మొదలవుతాయి. ఇక విజయవాడ, తిరుపతి ప్రయాణాలకు కొంతసమయం పట్టవచ్చని అధికారులు చెబుతున్నారు.





24 గంటలు సర్వీసుకు అనుకూలం

రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టు నుంచి రాత్రీ పగలూ మొత్తం 24 గంటలూ విమాన రాకపోకలు సాగించడానికి అనుకూలమైన సౌకర్యాలు ఉన్నాయి. ప్రస్తుతం ప్రయాణికుల ఆక్యుపెన్సీ బాగుంది. రోజుకు సగటున 1,400 మంది రాకపోకలు సాగిస్తున్నారు. నైట్ ల్యాండింగ్ కూడా ఉంది. ప్రధానమంత్రి ప్రయాణించే బోయింగ్ 777 వంటి పెద్ద విమానాలు ఇక్కడ నుంచి రాకపోకలు సాగించవచ్చు. ప్రస్తుతం ఉన్న టెర్మినల్‌ను మరో నాలుగు రెట్లు విస్తరిస్తున్నారు.

- ఎస్. జ్ఞానేశ్వరరావు, ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్

క్రైమ్ కార్నర్

పామాయిల్ గెలలు కోస్తూ..

- విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి


కళ్యాణ్(ఫైల్)

జంగారెడ్డిగూడెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పామాయిల్ తోటలో ఐరన్ గెడతో గెలలు కోస్తూ విద్యుత్ షాక్‌కు గురై రైతు మృతి చెందిన ఘటన శ్రీనివాసపురంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. మండలంలోని శ్రీనివాసపురంలో సోమవారం ఓ రైతుకు చెందిన పామాయిల్ తోటలో ఐరన్ గెడతో గెలలు కోస్తూ విద్యుత్ షాక్‌కు గురై రైతు తగరం కళ్యాణ్ (31) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా ప్రదేశానికి వెళ్లి మృతి దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఒక సోదరి, సోదరుడు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ జబీర్ తెలిపారు. మృతుడు టీడీపీ కార్యకర్త కావడంతో పార్టీ నాయకులు పెనుమర్తి రామకుమార్, బొబ్బర రాజ్‌పాల్ కుమార్, జొన్నకూటి శ్రీను ఆసుపత్రికి చేరుకుని కటుంబసభ్యులను పరామర్శించారు.

ఫీల్డ్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నం

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగంలో తనను ఇబ్బంది పెడుతున్నాడని, లైంగికంగా వేధిస్తున్నాడని మండలంలోని ఓ ఫీల్డ్ అసిస్టెంట్ సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాలివి.. మండలంలో ఓ గ్రామానికి చెందిన రమేష్ అనే వ్యక్తి ఆరోపణలు చేయడంతోపాటు లైంగికంగా వేధించినట్టు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫీల్డ్ అసిస్టెంట్‌గా చేస్తున్న మహిళ శనివారం ఫిర్యాదు చేసింది. ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని వేధించడంతో మనస్తాపం చెంది తన నివాసం వద్ద సోమవారం పురుగుల మందు తాగి ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఆమె ఫిర్యాదు మేరకు ఇప్పటికే అతడిపై కేసు నమోదు చేశామని, ఆత్మహత్యాయత్నంగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

ఇద్దరిపై పోక్సో కేసు

నరసాపురం రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను మాయమాటలు చెప్పి మరో ప్రాంతానికి తీసుకెళ్లిన ఇద్దరి యువకులపై రూరల్ పోలీసులు సోమవారం పోక్సో కేసు నమోదు చేశారు. ఎస్ఐ టి.వెంకటసురేష్ తెలిపిన వివరాలివి.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక కనిపించడం లేదంటూ ఈనెల 12న బంధువులు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టగా పట్టణానికి చెందిన నరసింహస్వామి బాలికకు మాయమాటలు చెప్పి తీసికెళ్లినట్టు గుర్తించామన్నారు. ఆ దిశగా విచారణ చేపట్టి బాలికను నిందితుడిని పట్టణానికి తీసుకొచ్చామన్నారు. విచారణలో అతడికి పట్టణానికి చెందిన చింతా నాగరాజు కూడా సహకరించినట్టు తేలడంతో ఇద్దరిపై పోక్సో కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ, కిడ్నాప్ కేసులు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

కాల్వలో గ్యాస్ సిలిండర్ల వ్యాన్ బోల్తా.. డ్రైవర్ మృతి


కాల్వలో బోల్తా పడిన గ్యాస్ సిలిండర్ల వ్యాన్ (ఇన్‌సెట్‌లో) నాగరాజు(ఫైల్)

కలిదిండి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇండేన్ గ్యాస్ సిలిండర్ల వ్యాన్ ప్రమాదవశాత్తు అదుపు తప్పి కాల్వలో బోల్తా పడడంతో డ్రైవర్ మృతి చెందాడు. కలిదిండి ఒకటో వార్డుకి చెందిన పోసిన శివ నాగరాజు (28) సోమవారం అమరావతిలో రోడ్డు పక్కన గ్యాస్ సిలిండర్ల వ్యాన్ ఆపి వినియోగదారులకు గ్యాస్ సిలిండర్లు దింపుతుండగా వ్యాన్ ఒకసారిగా ముందుకు కదలడంతో అదుపు చేయడానికి క్యాబిన్ లోపలకు వెళ్తుండగా కాల్వలో బోల్తా పడడంతో మృతి చెందాడు. శివనాగరాజుకి ఏడాది క్రితం అదే గ్రామానికి చెందిన ప్రసున్నాంబతో వివాహమైంది. అందరితో కలివిడిగా ఉండే శివనాగరాజు అయ్యప్ప మాలధారణలో ఆకస్మాత్తుగా దుర్మరణం చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు శోక సంద్రంలో మునిగిపోయారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దొంగను పట్టుకుని పోలీసులకు అప్పగింత

భీమవరం క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వాకింగ్‌కు వెళుతున్న వ్యక్తి వద్ద సెల్‌ఫోన్ లాక్కుని పారిపోతున్న దొంగను పోలీసులకు అప్పగించారు. వన్‌టౌన్ ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాలివి.. పట్టణంలోని బేతనిపేటకు చెందిన నరహరశెట్టి రాజ్‌కుమార్ అనే వ్యక్తి ప్రతిరోజు మాదిరిగా సోమవారం ఉదయం వీరమ్మ పార్క్ వద్ద వాకింగ్ చేస్తున్నారు. ఆ సమయంలో తణుకు పట్టణానికి చెందిన వరదా దినకరణ్ అనే వ్యక్తి రాజ్‌కుమార్ వద్ద సెల్‌ఫోన్ లాక్కుని పారిపోతుకుండా అతడిని పట్టుకున్నారు. అతడు వెంట తెచ్చుకున్న చాకుతో పొడవడానికి ప్రయత్నించగా రాజ్‌కుమార్‌తో పాటు మరో ఇద్దరు స్థానికులు అతడిని పట్టుకుని చాకు లాక్కుని పోలీసులకు అప్పగించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యాపారిపై వేడి నూనెతో దాడి.. తీవ్ర గాయాలు

భీమవరం క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : తాను కొనుగోలు చేసిన ఫ్రెంచ్ ఫ్రైస్ బాగా లేదని ఎందుకు మంచినూనె వాడడం లేదంటూ ఓ వ్యక్తి వీరంగం సృష్టించాడు. రెండో పట్టణంలోని పద్మాలయ థియేటర్‌లో సినిమాకు వెళ్ళిన చిన్న అప్పారావుతోటకు చెందిన కర్రి శ్రీహరి అనే వ్యక్తి ఆదివారం రాత్రి అక్కడ ఉన్న క్యాంటీన్‌లో ఫ్రెంచ్ ఫ్రైస్ కొనుగోలు చేశాడు. మీరు వాడిన నూనె బాగా లేదని యజమాని అయిన టీకు రాజ్‌కుమార్‌తో వాగ్వివాదం దిగాడు. చివరకు అక్కడ ఉన్న నూనెను శ్రీహరి కాళ్లతో తన్నడంతో యజమాని రాజ్‌కుమార్‌కు తీవ్ర గాయాలు కాగా అక్కడ ఉన్న నలుగురుకు స్వల్ప గాయాలయ్యాయి. దీనిపై రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఇబ్రాయిల్ తెలిపారు.

హోంగార్డు మృతదేహం లభ్యం


ఏడుకొండలు (ఫైల్)

మొగల్తూరు,నవంబరు18.(ఆంధ్రజ్యోతి): మొగల్తూరు పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న మామిడిశెట్టి ఏడుకొండలు(53) ఆదివారం మృతదేహం లభ్యమైందని ఎస్ఐ జి.వాసు సోమవారం తెలిపారు. శేరేపాలెంకు చెందిన ఏడుకొండలు 1994లో హోమ్‌గార్డుగా బాధ్యతలు చేపట్టాడని, గత కొంత కాలంగా షుగర్ వ్యాధితో బాధపడుతున్నాడని, ఈనెల 16న విధులు ముగించుకుని వెళ్ళిన ఏడుకొండలు ఇంటికి చేరకపోవడంతో ఆయన భార్య రాజ్యలక్ష్మి ఫిర్యాదు చేసిందన్నారు. బంధువులు, కుటుంబ సభ్యులు, పోలీసులు గాలించినా జాడ తెలియలేదన్నారు. ఆదివారం సాయంత్రం కొత్తోట ఉప్పుటేరులో ఒక మృతదేహం ఒడ్డుకు వచ్చిందని సమాచారం అందిందన్నారు. కుటుంబ సభ్యులకు సమాచారమందించగా మృతదేహం అతడిదిగా గుర్తించారన్నారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహనికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు.

అద్దెకు కార్లు తీసుకుని తాకట్టు పెట్టేశారు

- చీటింగ్ కేసు నమోదు

ఏలూరు క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అద్దెకు కార్లు తీసుకుని వాటిని తాకట్టు పెట్టారని పోలీసులకు ఫిర్యాదు అందడంతో ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన సాదనబోయిన రోహిత్‌కుమార్‌కు చెందిన రెండు కార్లను ఏలూరు పత్తేబాదకు చెందిన ఎల్లపు భానుచందర్, ఏలూరు పుష్పలీలానగర్‌కు చెందిన ముంగర అభిషేక్ అలియాస్ గణేష్‌లకు రెండు కార్లను అద్దెకు ఇచ్చారు. ఆ రెండు కార్లను వారిద్దరూ తాకట్టు పెట్టేసుకున్నారు. ఎంతకాలానికి అద్దె సొమ్ము కట్టడం కాని, కార్లు ఇవ్వడం కాని చేయకపోవడంతో అనుమానం కలిగిన రోహిత్ వచ్చి విచారణ చేశారు. ఆ కార్లు తాకట్టు పెట్టినట్టు తెలియడంతో ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారిద్దరిపై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.

ఎక్సైజ్ పోలీసుల దాడి.. ఒకరి అరెస్ట్

ఆగిరిపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో జరిపిన దాడుల్లో ఆగిరిపల్లి మండలం ఆగిరిపల్లి గ్రామానికి చెందిన పరసా కొండలరావును అరెస్ట్ చేశామని ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తానయ్య తెలిపారు. అతడి వద్ద నుంచి ఆరు మద్యం సీసాలను స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో నూజివీడు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సబ్-ఇన్‌స్పెక్టర్లు అయిన వై.ఈశ్వరరావు, ఎం.ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు. నూజివీడు, ముసునూరు, ఆగిరిపల్లి, చాట్రాయి మండలంలోని పదహారు మద్యం దుకాణదారులకు ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతిమనిషికి మూడు మద్యం బాటిల్ మించి ఇవ్వకూడదన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే మద్యం విక్రయించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు జరిపితే 99495 39933 కు సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటామని సమాచారమిచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు.. ముగ్గురి అరెస్టు

ఏలూరు క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కేవీఎస్ ప్రభుకుమార్ ఆదేశాలతో ఇన్‌స్పెక్టర్లు ఫణికుమార్, భోగేశ్వరరావు వారి సిబ్బంది సోమవారం జిల్లాలో విస్తృతంగా దాడులు నిర్వహించారు. చింతలపూడి మండలం గురుభట్లగూడెంలో రెండు కేసులు నమోదు చేసి నాయుడు వెంకటేశ్వరరావును అరెస్టు చేసి అతడి వద్ద పదకొండు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కొరిపల్లి శ్రీరామమూర్తిని అరెస్టు చేసి అతడి వద్ద పదమూడు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. లింగపాలెం మండలం వెస్తుయడవల్లి గ్రామంలో ఈడే మధుసూదనరావును అరెస్టు చేసి అతడి వద్ద నుంచి మూడు లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

దివ్యాంగురాలికి వీల్‌చైర్ అందచేత



దివ్యాంగురాలికి వీల్ చైర్ అందజేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నూజివీడుకు చెందిన కె.సంజనాప్రియకు కలెక్టర్ వెట్రిసెల్వి వీల్ చైర్‌ను అందచేశారు. కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యలు పరిష్కరిస్తూ వారికి సాయంగా ఉంటామన్నారు. అలాగే సంజనాప్రియకు అందుతున్న రూ.6 వేలు పింఛన్‌ను రూ.15 వేలు పెంచే విషయంపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

వాగ్దానాలన్ని నెరవేరుస్తాం



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరుటూటౌన్, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలన్నిటిని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని ఎమ్మెల్యే చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతీ మహిళలకు రూ.1500 పథకం అమలు చేయడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. డిసెంబర్ నెల నుంచి నూతన పింఛన్‌లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని అన్నారు. విధివిధానాలను ప్రభుత్వం ఖరారు చేసిందన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

దెందులూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఏలూరు రోడ్డు రవాణా శాఖ అధికారుల ఎస్‌బీ శేఖర్, నరేంద్ర అన్నారు. జాతీయ రహదారి వంగూరు అడ్డరోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో సోమవారం తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు పాటించని నలుగురికి జరిమానా విధించారు.

నిత్యావసరాల పంపిణీ

జంగారెడ్డిగూడెం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రావిచర్ల ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఎడ్యుకేషనల్ సొసైటీ (రైడ్స్), లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అనారోగ్యంతో బాధపడుతున్న 20 మంది పిల్లలకు నిత్యావసర సరుకులను స్థానిక రైడ్స్ కార్యాలయంలో సోమవారం పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ఛైర్మన్ ఎం.నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు హనుమంతరావు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.రామచంద్రరాజు, యు.సీతారామ్, కె.పండు, రైడ్స్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రం పరిశీలన

లింగపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ధర్మాజీగూడెంలోని ప్రతిభ జూనియర్ కాలేజ్‌లో జరుగుతున్న దూరవిద్య పరీక్ష కేంద్రాన్ని నాగార్జున యూనివర్సిటీ పరీక్షల కోఆర్డినేటర్ ప్రొఫెసర్ రామచంద్రన్ తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంపై ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నేతల నుంచి ఫిర్యాదు రావడంతో తనిఖీ చేసినట్లు ఆయన తెలిపారు. కళాశాలలో పరీక్షలు సక్రమంగానే జరుగుతున్నాయని అన్నారు. పరీక్షల నిర్వహణపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తానని అన్నారు.

పశువైద్య కేంద్రం తనిఖీ

భీమడోలు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : భీమడోలు పశువైద్య కేంద్రంలో సోమవారం వైద్యులు వీర్యనాళికల సమగ్ర తనిఖీ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భీమడోలు, ద్వారకాతిరుమల మండలాల పరిధిలోని పశువైద్య శాలలో పరిధిలో 2020- 24 ఏప్రిల్ వరకూ జరిగిన ఈ వీర్యనాళికల వినియోగం, ప్రస్తుతం ఉన్న స్టాకును తదితర అంశాలపై పరిశీలించారు. తాడేపల్లిగూడెం నుంచి డీఎల్‌డీఏపీవో జి.ఏసురత్నం కార్యక్రమంలో పాల్గొన్నారు. రెండు మండలాల్లో ఉన్న పశు వైద్య శాలల, గోపాలమిత్ర సెంటర్లు, అన్ని స్టాక్ యూనిట్లు తదితర వివరాలను రైతులకు తెలియజేసి వాటి ప్రాముఖ్యతను వివరించారు. డీఎల్‌డీఏ సిబ్బంది రామకృష్ణ, బాలాజీ, భీమడోలు సహాయ సంచాలకులు సాయిరమేష్, వైద్యులు హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

కెమెరా సృష్టికర్తకు ఘన నివాళి



డాగురే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

టి.నరసాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కెమెరా సృష్టికర్త లూయిస్ డాగూరే జయంతిని సోమవారం ఫొటో, వీడియో గ్రాఫర్ల యూనియన్ ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న స్థానిక జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం బి.లింగస్వామి డాగురే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, యూనియన్ సభ్యులు, వైద్యుల పంపిణీ చేశారు. వైద్యులు హనుమంతురావు, యూనియన్ వైస్ ప్రసిడెంట్ మహారాజు, సెక్రటరీ చందు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

● భీమడోలు : కెమెరా సృష్టికర్త జయంతిని భీమడోలు ఫోటోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంత మార్కెట్ సమీపం లోని అబ్దుల్ కలామ్, డాగురే విగ్రహాల వద్ద నిర్వహించారు. డాకురే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి స్వీట్లు పంచారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యా అవార్డు గ్రహీతలు పరామనందం, అహ్మద్, హేమలత, శ్రావణి, దుశ్శాలువాతో సత్కరించారు. యూనియన్ అధ్యక్షుడు శ్రీరామ్, బ్రహ్మారావు, రంగారావు, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ కష్టాలు



- నమోదైతేనే ఉచిత గ్యాస్
- గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లేమి
- పలువురు పేదలకు చేకూరని లబ్ధి

ఏలూరు రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉచిత సిలిండర్ పథకానికి ఈకేవైసీని ప్రభుత్వం తప్పనిసరి చేయడంతో పేదలకు కష్టాలు మొదలయ్యాయి. ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు పొందాలంటే గ్యాస్ ఏజెన్సీల ద్వారా ఆధార్‌తో లింక్ చేయించుకోవాలని చెబుతున్నారు. దీనిపై సరైన అవగాహన లేక పేదలకు ఈ పథకం అందడం లేదు. అయితే గ్యాస్ డెలివరీ బాయ్‌లు సిలిండర్ ఇచ్చే సమయంలో తప్పని సరిగా ఈకేవైసీ చేయించుకోవాలని చెప్పినా పట్టించుకోని పరిస్థితి. ప్రభుత్వం దీపావళి సందర్భంగా గతనెల 29 నుంచి ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇచ్చే పథకానికి శ్రీకారం చుట్టింది. ఏలూరు రూరల్ మండలంలో 26,350 మంది లబ్ధిదారులున్నారు. వీరిలో 21,879 మంది ఈకేవైసీ చేయించుకోలేదు. ప్రభుత్వం ఉచిత సిలిండర్ల పంపిణీ ప్రారంభించడంతో మరో 5 వేల మంది ఈకేవైసీ చేయించుకున్నారు. ఇంకా సుమారు 16 వేల మంది స్పందించ లేదు. ఈకేవైసీ చేయించుకుంటేనే ఈ ఉచిత సిలిండర్లు వస్తాయి. మరోవైపు గ్యాస్ కనెక్షన్ పొందే సమయంలో ఆధార్ అనుసంధానం చేయించు కోవాల్సి ఉంది. గతంలో రేషన్ కార్డు ఉండి, ప్రస్తుతం వివిధ కారణాలతో తొలగించిన వారికి కూడా ఈకేవైసీ నమోదు కాలేదు. కొంతమంది గ్యాస్ ఏజెన్సీల వద్దకు వెళ్ళి ఈకేవైసీ చేయించుకున్నా యర్రర్ చూపిస్తున్నాయి. దీంతో లబ్ధిదారుడు ఉచిత గ్యాస్ సిలిండరు పొందలేకపో తున్నారు. ఈ క్రమంలో మండలంలో ఇప్పటివరకు ఈకేవైసీ చేయించుకోని వారిని గుర్తించి వారి ఇంటి వద్ద చేయించి ఉచిత సిలిండర్లను అర్హులకు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఈ ప్రక్రియ ఎంత వరకు సాధ్యపడుతుందో చూడాలి. ఏ కుటుంబంలో అయితే రెండు గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయో అందులో ఒక్క కనెక్షన్‌కు మాత్రమే అర్హత ఉంది. ఎవరైనా గ్యాస్ కనెక్షన్ కొన్నేళ్ళుగా వాడకుండా ఉంటారో, వారు అనర్హులు అవుతారు. బుక్‌చేసిన మొదటి సిలిండర్‌కు ఈ పథకం వర్తిస్తుంది. బుక్ చేసుకోగానే అర్హులుగా నేరుగా 48 గంటల్లో సబ్సిడీ డబ్బులు పడతాయి. అయితే గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు ఈకేవైసీపై సరైన అవగాహన లేకపోవడంతో ఉచిత సిలిండర్ లబ్ధి వారికి చేరేలా లేదు.

రోడ్డుకు మోక్షం



బుట్టాయగూడెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు పట్టపగలే చుక్కలు చూపిన బుట్టాయగూడెం-జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. ఎన్‌ఆర్‌ఇజిఎస్ పథకంలో రూ.70 లక్షలతో మరమ్మతు పనులకు నిధులు మంజూరు కావడంతో ఇటీవలే పాడైపోయిన చోట ప్యాచ్‌వర్క్ చేశారు. సోమవారం నుంచి బీటీ రోడ్డు పనులు ప్రారంభం కావడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు. కాకపోతే పాడైపోయిన చోటనే రోడ్డును వేస్తుండటంతో మిలిగిన చోట్ల కూడా రోడ్డు పాడైపోవడం ప్రారంభమైందని రోడ్డును పూర్తిగా వేస్తే ప్రయోజనం ఉంటుందని ప్రజలు అంటున్నారు.

మానవత సాయం

దెందులూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గోపన్నపాలెంలోని శ్రీసీతారామ ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ నతానియాల్ ఆధ్వర్యంలో 110 మంది విద్యార్థులకు మానవత సంస్థ అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు సోమవారం నోట్ పుస్తకాలను, ప్యాడ్‌లను పంపిణీ చేశారు. అనంతరం ఇద్దరు పేద విద్యార్థులకు ఏడాదికి మెస్ బిల్లు చెల్లించారు. అనంతరం కోటేశ్వరరావును విద్యార్థులు, ప్రిన్సిపాల్ సత్కరించారు,

26న కలెక్టరేట్ వద్ద నిరసన

దెందులూరు,నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రైతులు, కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 26న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరిక నోటీసులు జారీ చేస్తు కలెక్టరేట్‌ల వద్ద నిరసన తెలుపుతామని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. పోతునూరు, దెందులూరులో సోమవారం రైతు జిల్లా అధ్యక్షు డు కె.భాస్కరావుతో కలిసి మాట్లాడుతూ చలో కలెక్టరేట్ మహాధర్నా కార్యక్రమం విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

● ఏలూరు కార్పొరేషన్ : ఈనెల 26వ తేదీన అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద సంయుక్త కిసాన్‌మోర్చ కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ స్వామినాధన్ కమిటీ సిఫార్సులు అమలు చేసి రైతులు గుర్తించిన 52 పంటలకు మద్దతు ధర ప్రకటించి చట్టం చేసి అమలు చేయాలన్నారు. సీపీఐ నాయకులు డి.ప్రభాకర్, ఎం. కృష్ణచైతన్య, తదితరులు ఉన్నారు.

ఫిర్యాదులు స్వీకరిస్తాం

జంగారెడ్డిగూడెం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కలెక్టరు ఆదేశాల మేరకు ప్రతి సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమిషనర్ కె.వెంకటరమణ తెలిపారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంటన్నర వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామన్నారు. మిగతా రోజుల్లో కూడా ప్రజలు నేరుగా తనను కలిసి ఫిర్యాదులు ఇవ్వవచ్చని కమిషనర్ తెలిపారు.

ఆక్రమణల తొలగింపు

ఉంగుటూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నారాయణపురంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు ఆక్రమణలను సోమవారం నిడమర్రు సర్కిల్ పరిధిలోని పోలీసులు, పారా మిలటరీ ఫోర్స్ సమక్షంలో జేసీబీలతో తొలగించారు ఎంపీడీవో రాజ్ మనోజ్, ఇన్‌చార్జి తహసీల్దార్ వై.పూర్ణ చంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ తొలగింపులు జరిగాయి.

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



చాటపర్రులో వినతిపత్రం అందచేస్తున్న నాయకులు

ఏలూరు రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర సమితి, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం పిలుపులో భాగంగా సోమవారం ఏలూరు రూరల్ మండలం చాటపర్రులో ఇళ్ల స్థలంలేని పేదలతో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసవర్మకు అర్జీలు అందచేశారు. బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేశ్వరరావు, ఎ.యోహాను, కె.నాగేశ్వరరావు, రాజు, మహిళలు పాల్గొన్నారు.

● చింతలపూడి : మండలంలోని యర్రగుంటపల్లి సచివాలయంలో సీపీఐ నాయకులు, పేదలతో కలిసి అర్జీలను అందచేశారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు ఎ.వనజ, జిల్లా కార్యదర్శి ఎం.చైతన్య నాయకులు కె.గురవయ్య, పాల్గొన్నారు.

● టి.నరసాపురం : గ్రామ సచివాలయం వద్ద ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాజ్‌కుమార్‌కు ఇళ్ల పట్టాల కోసం పేదలతో కలిసి అర్జీలు అందచేశారు. బీకేఎంయూ ఏలూరు జిల్లా కార్యదర్శి కె.వసంతరావు, మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి టి.జయరాజు, పి.సత్యం, తదితరులు పాల్గొన్నారు.

● కుక్కునూరు : అమరవరం సచివాలయం ఎదుట ఆందోళన చేశారు. పేదలకు గ్రామాల్లో 3సెంట్లు, పట్టణాల్లో 2సెంటర్ల స్థలం మంజూరు చేయాలన్నారు. సీపీఐ మండల కార్యదర్శి ఎం.వెంకటాచారి కె.లక్ష్మయ్య, కె.బాబురావు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం : మండలంలోని పంగిడిగూడెం, పేరంపేట గ్రామ సచివాలయాల వద్ద సీపీఐ మండల కార్యదర్శి జేబీ రమణరాజు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సచివాలయాల సిబ్బందికి వినతిపత్రాలు అందజేశారు. కె.వసంతరావు,కలపాల శ్రీరాములు, చిలపరెడ్డి వెంకటరెడ్డి, జగన్నాథకృష్ణ పాల్గొన్నారు.

● కామవరపుకోట : పేదలకు ఇళ్ల స్థలం ఇస్తానన్న కూటమి ప్రభుత్వం హామీ అమలు చేయాలని కోరుతూ సోమవారం మండలంలోని గ్రామ సచివాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి సచివాలయ కార్యదర్శులకు సమస్యలతో కూడిన వినతిపత్రాలను అందచేశారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించండి

కుక్కునూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. కుక్కు నూరులో సోమవారం పార్టీ 8వ మండల మహా సభలో ఆయన మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాలకు పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై ఉన్న శ్రద్ధ నిర్వాసితులపై లేదన్నారు. సర్వేల పేరుతో కాలం గడుపుతున్నారు కానీ నిర్వాసితులకు మా త్రం న్యాయం జరగటంలేదన్నారు. నిర్వాసితులకు పూర్తి స్థాయిలో పరిహారం ఇచ్చిన తరువాత పోలవరం ప్రాజెక్టు నిర్మాణం జరుపాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి.రామకృష్ణ, మండల కార్యదర్శి నాగేంద్రరావు, ఎం.నాగమణి, డి.రమేష్, కె.శ్రీను, లక్ష్మణరావు, వై.సాయికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న భూనిర్వాసితులు

ఏలూరు రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చింతలపూడి ఎత్తిపోతల పథకం భూనిర్వాసిత రైతులకు 2015-16లో ఇచ్చిన అవార్డు రద్దుచేసి కొత్త అవార్డు ప్రకారం పరిహారం చెల్లించాలని ఎకరాకు రూ.50 లక్షలు పరిహారం ఇచ్చి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ చింతలపూడి ఎత్తిపోతల పథకం భూనిర్వాసితుల పోరాట కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ప్రైవేట్ మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని, రైతులకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి డి.కృష్ణ, పోరాట కమిటీ నాయకులు వరలక్ష్మి, చెన్నయ్య మాట్లాడారు. ప్రభుత్వం వద్ద నిధులు లేవనే పేరుతో 9ఏళ్ళ తరువాత పాత అవార్డు ప్రకారం పరిహారం ఇస్తామని చెప్పడం అన్యాయమన్నారు. ఎత్తిపోతల పథకం పరిధిలో చెరువులు, కుంటలకు నీళ్లు ఇచ్చే విధంగా డిజైన్ మార్పు చేయాలని కోరారు. జి.ప్రసాద్‌రెడ్డి, ఎం.సత్యనారాయణరెడ్డి, భీమిరెడ్డి, మాధవరెడ్డి, చెన్నయ్య, శ్రీనివాస్, కుప్పాల వీరమ్మ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ముందుంటా : ఎంపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మహేష్‌కుమార్

టి.నరసాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పోలవరం నియోజకవర్గ సమస్యలు పరిష్కా రానికి ముందుంటానని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అన్నారు. స్థానిక విజయలక్ష్మి థియేటర్ వద్ద ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యకర్తలు, నాయకులు ఆత్మీయ సమావేశంలో ఎంపీ మహేష్ కుమార్ మాట్లాడుతూ అధికారులు ఇష్టం వచ్చినట్లు పనిచేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. త్వరలో సీఎంని కలిసి పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు వివరిస్తానని పేర్కొన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, స్థానిక నాయకులు జి.శ్రీరామ్మూర్తి, ఎస్.వెంకటేశ్వరరావు, చలపతిరావు, నాయుడు రామకృష్ణారావు గౌడ్, సూర్యనారాయణ, కాశీ పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాలు స్వాధీనం

పెదపాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పెదపాడు, పరిసర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి ఐషర్ వాహనంలో తరలిస్తున్న సు మారు 10 వేల కిలోల చికెన్ వ్యర్థాలను స్వాధీనం చేసుకున్నట్లుగా ఎస్సై కె.శారద సతీష్ తెలిపారు. చికెన్ వ్యర్థాలను గొయ్యి తీసి పూడ్చి పెట్టించి, వాహన, చెరువు యజమానులపై, డ్రైవర్‌పై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎక్సైజ్ దాడులు

జంగారెడ్డిగూడెం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పంగిడిగూడెంలో సోమవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ముప్పిడి రామకృష్ణారెడ్డి అనే వ్యక్తి వద్ద 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు ఎస్సైలు జి.వెంకటలక్ష్మి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సారా పట్టివేత

వేలేరుపాడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వసంతవాడ గ్రామ శివారులో కుక్కునూరు సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో సారా బట్టీలపై పోలీసులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో 500 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశారు. 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు.

కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభం

కామవరపుకోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో కామవరపుకోట మండలం జీలకర్రగూడెంలోని గుంటుపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని సోమవారం ఎంపీటీసీ కె.పుష్పరాజ్యం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయడం వలన యువతులకు ఉపాధి కల్పించినట్టు అవుతుందన్నారు. సర్పంచ్ జి.దాసు, బీజేపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ ఒ.యేసువర ప్రసాద్, మండల అధ్యక్షులు బాలవర్ధిరాజు, బిజెపి నాయకులు బాలరాజు, కె.సత్యనారాయణ, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీదేవిని అభినందించిన నేతలు

ఉంగుటూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : తాడేపల్లిలో మాదిగ కార్పొరేషన్ చైర్మెన్ ఉండవల్లి శ్రీదేవిని ఉంగుటూరు మండలం నుంచి టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు అభినందించారు. ఎన్.ఆశీర్వాదం, కె.రాజు, డి.రమేష్, బి.రత్తయ్య, జయరాజు, రవి కుమార్ చిట్టిబాబు, అంత్యరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జైలును పరిశీలించిన డీఎల్ఎస్ఏ కార్యదర్శి



ఏలూరులో ఆహార పదార్థాలను రుచి చూస్తున్న జడ్జి రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సోమవారం ఏలూరులోని జిల్లా జైలును సందర్శించారు. ఖైదీలకు అందిస్తున్న వసతులను తెలుసుకున్నారు. జిల్లా న్యాయ టసేవాధికార సంస్థలు ఖైదీలకు ఉచిత న్యాయ టవాదిని ఏర్పాటు చేసి కేసులు వాదిస్తున్నారన్నారు. కారాగారం సూపరింటెండెంట్ సీహెచ్ ఆర్‌వీ స్వామి, జైలర్ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● చింతలపూడి : స్థానిక సబ్ జైల్‌ను ఉమ్మడి జిల్లాల న్యాయ సేవాధికార కార్యదర్శి కె.రత్నప్రసాద్ సోమవారం తనిఖీ చేశారు. ఖైదీలకు అందుతున్న ఆహారం, వైద్య సదుపాయాలు, ఉచిత న్యాయం సహాయ ంపై ఖైదీల నుంచి వివరాలు అడిగి తెలుసుకు న్నారు. అనంతరం వంట శాలను, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. ఆయన వెంట జైల్ సూపరింటె ండెంట్ కృపానందం, న్యాయవాది యేసుపాదం, సోషల్ వర్కర్ ఎండీ అక్బర్ అలీ ఉన్నారు.

విభిన్నప్రతిభావంతుల ఆరోగ్య సంరక్షణకు కృషి

పెదవేగి : విభిన్నప్రతిభావంతుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. జానంపేట పంచాయతీ ప్రకాష్‌నగర్‌లోని విభిన్నప్రతిభావంతుల పాఠశాలలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర న్యాయ సేవాదికార సంస్థ ఆదేశాలను అనుసరించి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలో జిల్లాలోని విభిన్నప్రతిభావంతుల వసతిగృహాలు, పాఠశాలల్లో వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి, వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. వైద్యులు డాక్టర్ జాన్సరాయ్, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం



రెడ్డి అప్పలనాయుడును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

పెదవేగి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : విజయవాడ రీజియన్ ఆర్టీసీ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు రోడ్డు ప్రమాదం నుంచి తృటిలో బయటపడ్డారు. విజయవాడ నుంచి ఏలూరు వస్తున్న ఆయన కారుకు ప్రమాదం జరిగింది. ముందు వెళ్తున్న వాహనం ఒక్కసారిగా ఆగడంతో ఆ వెనుకే ఉన్న రెడ్డి అప్పలనాయుడు ప్రయాణిస్తున్న కారు ముందున్న కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెడ్డి అప్పలనాయుడు ప్రయాణిస్తున్న కారు ముందు భాగం దెబ్బతింది. రెడ్డిఅప్పలనాయుడు ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడ్డారు. అదే సమయంలో విజయవాడ నుంచి ఏలూరు వస్తున్న దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రమాద సంఘటనను చూసి, వెంటనే రెడ్డి అప్పలనాయుడును పరామర్శించి, ప్రమాదంలో ధ్వంసమైన అప్పలనాయుడు కారును తన వ్యక్తిగత సిబ్బందితో విజయవాడ షోరూమ్‌కు తరలించి, అప్పలనాయుడును తన కారులో ఏలూరు తీసుకొచ్చారు.

పాఠశాలల పని వేళల పెంపు వద్దు

ఏలూరు అర్బన్/కామవరపుకోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ హైస్కూళ్ళలో పని వేళల పెంపు యోచన, యత్నాలను నిలిపి వేసి కొఠారి కమి షన్ సిఫారసుల మేరకు ప్రస్తుతం ఉన్న టైమి ంగ్సనే కొనసాగించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆంజనేయులు, సుబ్బారావు డిమాండ్ చేశారు. పని గంటల పెంపువల్ల ముఖ్యంగా దూరప్రాంతాల నుంచి స్కూలుకు రాకపోకలు సాగించే విద్యా ర్థులకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందన్నారు. విద్యార్థుల కోరిక మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని తరగతులకు తెలుగు మాధ్యమాన్ని పునఃప్రారం భించి, బోధన జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకో వాలన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా ఇంత వరకు మధ్యంతర భృతి, డీఏ బకాయిలు ప్రకటించలేదని, టీచర్లు తీవ్ర నిరాశలో ఉన్నారని తెలిపారు.

కోత యంత్రాల కిరాయి నియంత్రించండి

ఏలూరు రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వరి మిషన్ కోత కిరాయిలు నియంత్రించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో జేసీ ధాత్రిరెడ్డికి రైతులు వినతిపత్రం అందచేశారు. జిల్లా అధ్యక్షుడు కె.భాస్కర్‌రావు, కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయని, వాతావరణ మార్పులు ఆసరా చేసుకుని వరికోత మిషన్ కిరాయిలు పెంచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని నియంత్రించాలని విజ్ఞప్తి చేశారు.

జీతాలు పెంచకపోతే ఉద్యమిస్తాం

పెదవేగి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : ఇచ్చిన హామీల మేరకు జీతాలు పెంచాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని వంగూరులోని గౌతమీ ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్(లిక్కర్ ఫ్యాక్టరీ) కార్మికులు హెచ్చరించారు. జీతాలు పెంచకపోవడాన్ని నిరసిస్తూ కార్మికులు సోమ వారం ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేపట్టారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఇఫ్టూ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్రావు మాట్లాడుతూ జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. స్పందించిన యాజ మాన్యం ప్రతినిధి నాగేశ్వరరావు మాట్లాడుతూ జీతాల పెంపుదల విషయమై హైదరాబాద్‌లో యాజమాన్యంతో చర్చించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళ న విరమించిన కార్మికులు విధులకు హాజరయ్యా రు. గౌతమీ ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ యూనియన్ అధ్యక్షురాలు బి.పద్మ, ఎం.రంగమ్మ, పాల్గొన్నారు

గురుకుల విద్యార్థినుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ద్వారకాతిరుమల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పోలసానిపల్లిలో జరిగిన జోనల్‌స్థాయి ఆటల పోటీల్లో ద్వారకాతిరుమల అంబేడ్కర్ గురుకులం విద్యార్థినులు ఓవరాల్‌గా రెండో స్థానం చాంపియన్‌షిప్ సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బి.రాణి తెలిపారు. ఖోఖోలో విన్నర్, చెస్‌లో రన్నర్‌గా నిలిచినట్లు చెప్పారు. 200మీ, 800మీటర్ల పరుగు పందెంలో 9వతరగతి విద్యార్థిని సిహెచ్ కుమారి ప్రథమ, ద్వితీయస్థానాలు సాధించిందన్నారు. 800 మీ పరుగులో కె.హేమకుమారి తృతీయ, 400లో ద్వితీయ స్థానాలు సాధించిందన్నారు. కె.శ్రీవల్లి జావలిన్‌లో ద్వితీయ, డిస్కస్‌త్రోలో ద్వితీయ స్థానాలు వచ్చాయన్నారు. కె.శ్రావణి జావలిన్‌త్రోలో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నట్లు ఆమె వివరించారు. విజేతలను పాఠశాలలో ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు.

క్రీడలతో మానసిక వికాసం

ఏలూరు క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదం చేస్తాయని జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సిహెచ్ సూర్యచక్రవేణి అన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల సంరక్షణ యూనిట్, మిషన్ వాత్సల్య పథకం ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా ఏలూరు ప్రభుత్వ బాలుర వసతి గృహంలో క్రీడల పోటీలు నిర్వహించారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, క్రీడలు, వ్యాయామం చేయడం వల్ల ఆరోగ్యం, ఏకాగ్రత లభిస్తుందన్నారు. బాలుర గృహంలో ఉన్న బాలలకు చెస్, షటిల్, వాలీబాల్ సంబంధించిన క్రీడలు నిర్వహించి, గెలిచిన వారికి బహుమతులు అందించడం జరిగింది. బాలల సంరక్షణ సిబ్బంది రాజ్‌కు మార్, హోమ్ సూపరింటెండెంట్ పి శ్రీవల్లి, డిప్యూటీ సూపరింటెండెంట్ సత్యనారాయణ, కేసు వర్కర్ మోహనరావు హోం సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు



పెదవేగిలో వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

ఏలూరు టూ టౌన్/దెందులూరు/పెదవేగి/లింగపాలెం , నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం గ్రంథాలయ ప్రాముఖ్యత అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు గ్రంథాలయ కార్యదర్శి శేఖర్‌బాబు, డిప్యూటీ లైబ్రేరియన్ నారాయణరావు, అసిస్టెంట్ లైబ్రేరి యన్ సందీప్ కుమార్, డ్రాయింగ్ టీచర్ లక్ష్మీనాగే శ్వరరావు, టీచర్ ఎం.హరిత, లయన్స్‌క్లబ్ ప్రెసిడెం ట్ వీవీ రమణ పాల్గొన్నారు. మహిళా గ్రంథాల యంలో గ్రంథపాలకురాలు వై.శ్రీదేవి ఆధ్వర్యంలో వారోత్సవాలు జరిగాయి. న్యాయ నిర్ణేతలుగా దెందులూరులో వ్యాసరచన, క్విజ్, కవితలు, తదితర పోటీలు నిర్వహించి విజేతలకకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అధికారి జి ఝూన్సిరాణీ పాల్గొన్నారు. పెదవేగి శాఖా గ్రంథాలయంలో క్రీడాపోటీలు నిర్వహించారు. క్రీడాపోటీలను ఎస్ఎంసీ హైస్కూల్ కరస్పాండెంట్ సీహెచ్ అవినాష్‌రాజు ప్రారంభించారు. గ్రంథపాలకుడు టి.అరుణ్‌కుమార్, పీఈటీలు ధనలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెం శాఖ గ్రంథాలయలో ఆటల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి సిహెచ్ వెంకటరమణ పాల్గొన్నారు. ఉంగుటూరులో విశ్రాంత ఉపాధ్యాయుడు విస్సాం బమూర్తి విద్యార్థులకు పరిశుభ్రతపై అ‌గాహన కల్పించారు. గ్రంథపాలకుడు సీహెచ్ గంగాధరం తదితరులు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీలు చేస్తా : కలెక్టర్

ఏలూరు అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలాలవారీగా సీసీ రోడ్ల నిర్మాణంపై నిర్దేశిత లక్ష్యాన్ని డిసెంబరు 31లోగా పూర్తి చేయాలని వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. రోడ్ల నిర్మాణ పనులను ఆకస్మిక తనిఖీ చేస్తానన్నారు. పనులను జడ్పీ సీఈవో, ఎంపీడీవోలు, పంచాయతీల ఏఈ లు కూడా తనిఖీలు చేయాలన్నారు. ఉచిత ఇసుక కోసం అనుమతి పత్రాలను ఎంపీడీవో జారీ చేయాలని సూచించారు. జడ్పీ సీఈవో సుబ్బారావు, డ్వామా పీడీ వెంకటసుబ్బారావు, ఆర్ఐ చంద్ర శేఖరబాబు తదితరులు పాల్గొన్నారు.

శివయ్యకు ప్రభోత్సవం



ద్వారకాతిరుమల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గంగాపార్వతీ సమేతంగా కొలువుతీరిన శివయ్య ప్రభోత్సవం సోమవారం రాత్రి భక్తులను అలరించింది. విశేషంగా అలంకరించిన అశ్వాలతో కూడిన రథవాహనంపై స్వామి, అమ్మవార్లను ఉంచి అలంకరించారు. అనంతరం హారతులిచ్చారు. తరువాత ఈ వాహనం క్షేత్రపురవీధులకు రాగా ప్రతీ ఇంటి ముందు భక్తులు దర్శించి హారతులు పట్టారు. శ్రీవారి ధర్మప్రచార రథం జంగారెడ్డిగూడెం మండలంలో పర్యటనకు బయలుదేరింది. రథాన్ని ఈవో సత్యనారాయణమూర్తి ప్రారంభించారు. వాహనంలో స్వామి, అమ్మవార్లను ఉంచి ప్రత్యేక అలంకారం చేశారు. ద్వారకాతిరుమల బీసీ, ఎస్సీ కాలనీల్లో భక్తుల దర్శనానంతరం జంగారెడ్డిగూడెం మండలంలోని 8 గ్రామాల్లో పర్యటించేందుకు బయలుదేరివెళ్లింది.

చినతిరుపతిలో కార్తీక రద్దీ



ద్వారకాతిరుమల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): క్షేత్రపాలకుడిగా విరాజిల్లుతోన్న భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. భక్తుల రద్దీని క్రమబద్ధీకరించేందుకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శివదేవుని లింగ స్వరూపానికి అర్చకులు అర్చన, అభిషేకాలు నిర్వహించి హారతులను ఇచ్చారు. మహిళలు ఉసిరి చెట్ల వద్ద కార్తీక దీపాలను వెలిగించారు.



ఏలూరులో కలెక్టరేట్ వద్ద రిలే దీక్ష చేపట్టిన 108 ఉద్యోగులు

108 ఉద్యోగుల ఆందోళన

● సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ వద్ద రిలే దీక్ష

ఏలూరు రూరల్/భీమవరం టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): 108 అంబులెన్స్ సిబ్బంది సోమవారం రిలే దీక్ష చేపట్టారు. 108 సర్వీసులోని ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కొద్దిరోజులుగా ఆందోళన చేపట్టినా ప్రభుత్వ అధికారులు పరిష్కరించకపో వడంతో కలెక్టరేట్ వద్ద సోమవారం ఒకరోజు రిలేదీక్షా నిర్వహించారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించని పక్షంలో నవంబరు 25 తరువాత సమ్మెకు వెళతామని 108 ఉద్యోగులు హెచ్చరించారు. సమ్మె కారణంగా ప్రజలకు కలిగిన అసౌకర్యానికి యాజమాన్యం, ప్రభుత్వ అధికారులు పూర్తి బాధ్యత వహించాలన్నారు. 108 అంబులెన్స్ వ్యవస్థను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. మూడు షిఫ్ట్‌ల్లో 8 గంటల పని విధానం అమలు చేయాలన్నారు. ప్రభుత్వ నియామకాల్లో వెయిటేజ్ మార్కులు అందించాలని వైద్య ఆరోగ్యశాఖలో ఈఎంటి పోస్టుల్లో 108లో పనిచేస్తున్న ఈఎంటీలను నియమించాలన్నారు. సహజ, ప్రమాద మరణం పొందిన ఉద్యోగి కుటుంబానికి రూ.25లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలని ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 108 వ్యవస్థను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని, ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, గత తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన జీవో ఎంఎస్ 49 ను పునర్ధరించాలని పలు అంశాలతో నిరశన వ్యక్తం చేశారు. అధ్యక్షుడు ఇబ్బా ప్రసాద్, కార్యదర్శి రమేష్, వర్కింగ్ అధ్యక్షుడు నారాయణమూర్తి, ఉపాధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరావు, శివ, తదితరులు పాల్గొన్నారు.



భీమవరం కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్షలో 108 అంబులెన్స్ ఉద్యోగులు

బాధ్యతల్లో బందీ

● కష్టాల కడలిలో పురుషులు

● బాల్యం నుంచి వృద్ధాప్యం వరకూ బాధ్యతలే



పురుషులతో పాటు మహిళలకు సమానత్వం పాటించాలి, మహిళలను గౌరవించాలనే ఉపన్యాసాలు సాధారణం. నిజంగా పురుషులకు అన్ని అవకాశాలున్నాయా..? గౌరవాలు దక్కుతున్నాయా..? వివక్ష లేదా..? సమస్యలు లేవా అంటే..? ఎంత మంది కచ్చితమైన సమాధానం చెప్పగలరు. అవును సగటు పురుషుడు బాధ్యతల బందీ అయ్యాడనేది వాస్తవం. మహిళలతో పాటు పురుషుడు కూడా సమస్యలు ఎదుర్కొంటున్నారనేది వాస్తవం. మహిళ ప్రత్యేకతను చాటే మహిళా దినోత్సవం 1911లోనే రూపుదిద్దుకుంది. అలాగే పురుష దినోత్సవం కూడా ఉండాలనే ఆలోచన బయలుదేరింది. దీనికి 90వ దశకంలో ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఇంటర్నేషనల్ మెన్స్‌డే (ఐఎండీ) ఏటా నవంబరు 19న ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నారు. నేడు ప్రపంచ పురుషుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

- పాలకొల్లు

ట్రినిడాడ్ టొబాగో దేశస్థులు మొదట పురుషుల దినోత్సవానికి ఊపిరి పోశారు. దక్షిణ ఐరోపాకు చెందిన మాల్టా దీవిలో 1994 ఫిబ్రవరి 7 నుంచి జరుపుతున్నారు. 1999 నవంబరు 19 నుంచి ప్రపంచ వ్యాప్తంగా పురుషుల దినోత్సవం జరుపుతున్నారు.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 20- 50 మధ్య వయస్కులు సుమారు 8లక్షల మంది ఉన్నారు. జిల్లాలో పురుషుల వివక్షతకు వస్తే ముఖ్యంగా వైవాహిక జీవితాలకు సంబంధించి భార్యభర్తల తగాదా కేసులు జిల్లా వ్యాప్తంగా నిత్యం పదుల సంఖ్యలో నమోదవుతున్నాయి. విచిత్రం ఏమిటంటే ఒకప్పుడు వరకట్నం వేధింపులు గృహహింస, ఇతరతరా ఇబ్బందులతో మహిళలు ఎక్కువగా ఆత్మహత్యలకు పాల్పడే వారు. ఇప్పుడు ఆత్మహత్యలను పరిశీలిస్తే ప్రతీ నాలుగు ఆత్మహత్యలలో ముగ్గురు పురుషులే ఉంటున్నారు. ప్రతీ మూడు హింసాత్మక ఘటనలలో ఇద్దరు పురుషులు బలి అవుతున్నారు. కుటుంబ నేపథ్యంలో అనేక సందర్భాలలో పురుషులే నష్టపోతున్నారు. ముఖ్యంగా భార్యభర్తల వివాదాల్లో భార్య పోలీస్‌స్టేషన్, న్యాయస్థానాలను ఆశ్రయిస్తే వాస్తవం ఏదైనా ముందుగా భర్త తోబుట్టువులు తల్లిదండ్రులు జైలు పాలవుతున్నారు. ఈకారణంగా పురుషుల ఇబ్బందులు ముఖ్యంగా వివాహిత పురుషులు ఎదుర్కొంటున్న కష్టాలపై ఇటీవల జిల్లాల వారీగా భార్యా బాధిత సంఘాలు వెలుస్తున్నాయి. ఈపరిస్థితుల్లో 90వ దశకంలో పురుషుల దినోత్సవం ఏర్పాటుకు రూపకల్పన జరిగింది. ఇప్పటికే అంతర్జాతీయ మహిళా దినోత్సవం, పితృదినోత్సవం జరుపుకుంటున్నప్పటి కీ పురుషులకంటూ ఒక దినోత్సవం లేకవపోడం పురుషుల దినోత్సవ ఆలోచనకు దారి తీస్తుంది.

పురుషుల దినం ప్రాథమిక లక్ష్యాలు

ఈ దినోత్సవం ప్రాథమికి లక్ష్యం ఆదర్శ పురుషులను గుర్తించడం. కేవలం సినీ తారలను క్రీడాకారులను మాత్రమే కాకుండా కాయకష్టం చేసుకున్నవారైనా గౌరవప్రదమైన పురుషుల కంటే సంఘానికి కుటుంబానికి వైవాహిక వ్యవస్థ, శిశు సంరక్షణకు పురుషుల ఒనగూర్చిన ప్రయో జనాలను చెప్పడం పురుషుల సాంఘిక, భావో ద్వేగ, శారీరక ఆధ్యాత్మిక ఆరోగ్యంపై దృష్టి సారించడం, చట్టాలలో పురుషుల ఎదుర్కొంటున్న వివక్షతను చాటడం స్త్రీ పురుషుల మధ్య సఖ్యత సంబంధాలను నెలకొల్పడం, లింగ సమానత్వం వ్యాపింప చేయడం పురుషుల దినోత్సవం ప్రాధాన్యాంశాలు

పురుషుల ఇబ్బందులు

వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యుహెచ్‌వో) అంచనా ప్రకారం 45 ఏళ్ల కంటే తక్కువ వయస్సు పురుషుల మరణాలకు ఆత్మహత్యలే ప్రధాన కారణంగా తేలింది. విద్యాపరంగా వెనుకబడుతున్నారు. అనేక మంది పురుషులు నిరాధార ఆరోపణల తో జైలు పాలవుతున్నారు. పురుషులు వివక్షకు గురవుతున్నారు.

గోప్యత విషయంలో..

అత్యాచారాలు లేదా గృహ హింస వంటి దాడుల కేసులలో అరెస్ట్ అయిన పురుషులను ప్రచార మాధ్యమాలు వేలెత్తి చూపుతూ అవసరం కంటే ఎక్కువ ప్రచారం చేస్తున్నాయి. స్త్రీల విషయానికి వస్తే బాధితుల పేర్లను సైతం గోప్యంగా ఉంచుతున్నారు. పురుషుల విషయానికి వస్తే మితిమీరిన పబ్లిసిటీ ఇస్తున్నారు. విశేషం ఏమిటంటే ఈ తరహా కేసులలో అధిక శాతం కొట్టివేయబడుతున్నాయి. పురుషులు నిర్దోషులుగా బయటకు వస్తున్నారు. కానీ జరగాల్సిన నష్టం జరిగిపోతుంది.

సమాన హక్కులు ఉన్నాయా..?

నేడు స్త్రీలతో పాటు పురుషులకు సమాన హక్కులు కొన్ని సందర్భాలలో దక్కడం లేదు. సమాజంలో మహిళలకు బలం లేనప్పటికీ చట్టంలో బలం ఉండటంతో కొన్ని సందర్భాలలో పురుషులు తప్పు చేయకుండానే శిక్షను అనుభవిస్తున్నారు. ఇటీవల ఒక మాజీ ప్రజాప్రతినిధిపై కేసు పెట్టిన మహిళ మరలా అతను నిర్దోషి అని హైకోర్టు తెలిపారు. ఇటీవల పలువురు పురుష సెలబ్రెటీలు పైనా కేసులు నమోదవుతున్నాయి. విచిత్రం ఏమిటంటే ఎప్పుడో 10-20 సంవత్సరాల క్రితం సంబందిత పురుషుల వలన నష్ట పోయానంటూ కేసులు పెడుతున్నారు. ఇలా అనేక సందర్భాలలో పురుషులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

హనీ ట్రాప్.. దొంగ పెళ్లిళ్లు..!

ఇటీవల పాలకొల్లు మండలంలోని ఒక యువకుడికి 30 దాటినా వివాహం కాకపోవడంతో ఎనిమిదేళ్ల వయస్సు కొడుకు ఉన్న డైవోర్స్ మహిళను వివాహమడారు. వివాహమైన 3 నెలలు పాటు ఉన్న ఆమె నా భర్తకు మగతనం లేదంటూ ఆరోపించి అతడి నుంచి లక్షలాది రూపాయలు గుంజేసింది.

పాలకొల్లు మండలానికి చెందిన మరో వివాహితుడిని ఒక వివాహిత మహిళ హనీ ట్రాప్‌లోకి దింపి రూ.2కోట్లు ఆస్తిని కాజేసింది.

పాలకొల్లు పట్టణానికి చెందిన మరో కేసులో డైవర్స్ అయిన వివాహిత మరొకరిని పెళ్లి చేసుకుని చుక్కల చూపించింది. అనేక కేసులలో పురుషులు బాధితులుగా మిగిలుతున్నారు.

ఇటీవల ఉమ్మడి జిల్లాలో న్యాయవాదులను ఆశ్రయిస్తున్న విడాకుల కేసులలో మూడింట రెండు వంతులు పురుష బాధితులే ఉంటున్నారని న్యాయవాదులు చెబుతున్నారు. మొత్తంగా పురుషులు బాల్యంలో నీవు మగాడివిరా అనే తల్లి మాటలతో మొదలుకొని వృద్ధాప్యంలో జీవితం చరమాంకం వరకూ బాధ్యతలను మోస్తూ యోగి వేమన చెప్పినట్లు కష్టాలను ఎదుర్కొంటూనే పుణ్య పురుషులుగా మిగులుతున్నారు.

తాగునీటి చెరువు కలుషితం

దాహంతో అల్లాడుతున్న ప్రజలు

కలిదిండి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో మట్టగుంట తాగునీటి చెరువు నీరు రంగు మారి కలుషితమైంది. చెరువు నీరు తీవ్ర దుర్వాసన వస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు. చెరువు నీరు ఉప్పగా ఉండడంతో వాడుకోవడానికి కూడా ఉపయోగపడడం లేదని స్నానాలు చేస్తే దురదలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువునీరు ఉప్పగా ఉంటుందని తాగటానికి ఆమోదయోగ్యంగా లేకపోవటంతో ప్రైవేట్ వాటర్ ప్లాంట్‌లలో బిందెడు నీరు రూ.10 చొప్పున కొనుగోలు చేసి తాగుతున్నామని వాపోతున్నారు. పంచాయతీ అధికారులు క్లోరినేషన్ చేసినా ప్రయోజనం కనిపించడం లేదు. ఈ విషయమై సర్పంచ్ అంద్రాజు రత్నమణిని వివరణ కోరగా చెరువులో రంగుమారిన కలుషిత నీరును పూర్తిగా తొలగించి నాలుగు రోజులపాటు చెరువు ఎండగట్టి నీరు నింపడానికి చర్యలు తీసుకుంటామన్నారు.


మట్టగుంటలో కలుషిత తాగునీటి చెరువు

తాగునీటి వంతు విడుదల చేయగానే చెరువును నింపడానికి ప్రాధాన్యం ఇస్తామని ఇరిగేషన్ అధికారులు తెలిపారన్నారు.

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు


ముసునూరులో వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

చాట్రాయి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాలో భాగంగా చనుబండ శాఖ గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. సీనియర్ విభాగానికి 'సోషల్ మీడియా విద్యార్థులపై ప్రభావం', జూనియర్స్‌కి 'పరిసరాల పరిశుభ్రత' అనే అంశా లపై వక్తృత్వ పోటీలు జరిగాయి. గ్రంథాలయ అధికారి శ్రీకాంత్ పోటీలు నిర్వహించారు.

● ఆగిరిపల్లి : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా ఆగిరిపల్లి శాఖ గ్రంథాలయంలో సోమవారం చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జిల్లా పరిషత్ స్కూల్ విద్యార్థులు, స్కూల్ టీచర్స్ గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● ముసునూరు : ముసునూరు, గోపవరం శాఖ గ్రంథాలయాల అధికారులు టి.రాజేశ్వరి, జె.సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులు పలు అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో విద్యార్థి దశలో నైతిక విలువల బోధన నేరప్రవృతిని అరికట్ట కలదా ?, జూనియర్స్ విభాగంలో విద్యార్థి దశలో 'క్రీడల వల్ల లాభాలు' అనే అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీ పాఠశాల హిందీ ఉపాధ్యాయిని ఎస్.లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

● కలిదిండి/ ముదినేపల్లి/ కైకలూరు/ మండవల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కలిదిండి, కోరుకొల్లు గ్రంథాలయాల్లో సోమవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు వారోత్సవాల ముగింపు సభలో బహుమ తులు ప్రదానం చేస్తామని కలిదిండి, కోరుకొల్లు గ్రంథాలయాల అధికారులు జె.రమేష్, రాఘవులు తెలిపారు. ముదినేపల్లి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు పోటీలను నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి ఎం.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. కైకలూరు గ్రంథాలయంలో విద్యార్థులకు పి.కళ్యాణి అధ్యక్షతన చిత్రలేఖనం, క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మండవల్లి గ్రంథాలయ ఆధ్వర్యంలో హైస్కూల్ విద్యార్థులకు క్విజ్, గ్రూప్ డిస్కషన్ సోమవారం నిర్వహించారు. హెచ్‌ఎం ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.


ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీవో

నర్సరీలో మొక్కలతో పాటు రశీదులు ఇవ్వండి

▸▸ ఆర్డీవోకు రైతు నాయకుల వినతి

నూజివీడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నూజివీడు రెవెన్యూ డివిజన్ పరిధిలో నర్సరీలు నిర్వహించే వారివద్ద నుంచి కూరగాయలు, మిర్చి తదితర మొక్కలతో పాటు విధిగా రశీదులు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని రైతు సంఘం నాయకులు నూజివీడు ఆర్డీవో ఎం.వాణిని కోరారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఈ మేరకు రైతుసంఘం నాయకులు అర్జీ అందించారు. నాణ్యతలేని విత్తనాలు తెచ్చి మొక్కలుగా పెంచి రైతులకు అమ్మడం వల్ల రైతులు లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి తీవ్రంగా నష్టపోతున్నారని, కనీసం నారు గురించి అడిగే పరిస్థితి ఉండడం లేదని, దీన్ని దృష్టిలో పెట్టుకుని రైతులకు రశీదులు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని రైతుసంఘం నాయకులు నిమ్మగడ్డ నరసింహా, ఆర్డీవో దృష్టికి తీసుకువచ్చారు. నూజివీడు డివిజన్‌పరిధిలో పలు సమస్యలపై 16 అర్జీలు వచ్చాయని ఆర్డీవో ఎం.వాణి తెలిపారు. పలు శాఖల పరిధిలో అందిన అర్జీలను సత్వరం పరిష్కరించేందుకు ఆయాశాఖల అధికారులు చర్యలు చేపట్టాలని ఆమె కోరారు.

కార్తీక పూజలు


బలివే శివాలయంలో భక్తుల పూజలు

ముసునూరు/కలిదిండి/కైకలూరు/ముదినేపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మూడో సోమవారం శివాల యాలకు భక్తులు పోటెత్తారు. బలివే రామ లింగేశ్వరస్వామికి అర్చకులు టి.అరుణ భాస్కరరావు ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని. పూజలు చేసి. కార్తీక దీపారాధనలు వెలిగించారు. గోపవరంలో అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వరాలయం, చెక్కపల్లిలో గంగా పార్వతి సమేత రామలింగేశ్వరాలయం భక్తులు పూజలు నిర్వహించి, కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించారు. బలివే ఆలయ ఈవో సీతారామయ్య పర్యవేక్షణలో సిబ్బంది భక్తులకు తీర్థపసాదాలను అందజేశారు. కలిదిండి పాతాళ భోగేశ్వరస్వామి, కోరుకొల్లు సోమేశ్వరస్వామి, పెదలంక నాగేశ్వరస్వామి, వెంకటాపురం వల్లభేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేసి దీపాలు వెలిగించారు. గ్రూపు దేవాలయాల ఈవో శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కైకలూరులో పార్వతీ సమేత రామలింగేశ్వర, రామేశ్వరస్వామి వార్లకు ముత్తంరాజు శర్మ, ముత్తంరాజు రాజశేఖర్ స్వామి, ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో విశేష పూజలను నిర్వహిం చారు. కార్తీక సోమవారం సందర్భంగా ముదినేపల్లి మండలం శ్రీహరిపురం షిర్డీ సాయిబాబా మందిరంలో గురుస్వామి నీలం నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో బొప్పన వెంకన్న దంపతులు సుమారు 600 మంది అయ్యప్ప, భవానీ మాలాధారులకు అన్నదానం చేశారు. అల్లూరు సోమేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక దీపారాధనలు నిర్వహించారు.


వలసపల్లిలో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులు

ముమ్మరంగా సీసీ రోడ్ల నిర్మాణ పనులు

ముసునూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. వలసపల్లిలో సర్పంచ్ చలసాని దామోదరరావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు మేదరమెట్ల సురేంద్ర ఆధ్వర్యంలో అంతర్గత రహదారులను ఎక్స్‌కవేటర్‌తో చదునుచేసి చిప్స్ వేస్తున్న పనులు జరుగుతున్నాయి. ముసునూరులో సర్పంచ్ తనయుడు, నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి కొండేటి ఉదయ్‌కిరణ్ పర్యవేక్షణలో రహదారులకు చిప్స్ వేసి, రోలింగ్ చేసే పనులు వేగంగా జరుగుతున్నాయి. అక్కిరెడ్డిగూడెం, కాట్రేనిపాడు, లోపూడి, రమణక్కపేట తదితర గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. గత ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధి కుంటుపడిందని, కూటమి ప్రభుత్వం రాగానే గ్రామాల్లో అంతర్గత రహదారులను సీసీరోడ్లుగా అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేసి, పనులు వేగంగా పనులు జరుగుతున్నాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



బాలోత్సవ్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్

'బాలోత్సవ్'లో త్రివిధ విద్యార్థుల ప్రతిభ

నూజివీడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరావతిలో నిర్వహించిన బాలోత్సవ్ కార్యక్రమంలో నూజివీడు త్రివిధ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారని త్రివిధ ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. వ్యాసరచన పోటీల్లో పదో తరగతికి చెందిన జి.రోహిత ప్రథమ స్థానం, కె.నిఖిలశ్రీ రెండో స్థానం, కార్టూన్ డ్రాయింగ్‌లో ఫిరదోస్ మొదటిస్థానంలోనూ, వ్యాసరచనలో కె.జాహ్నవి రెండో బహుమతి, కె.హరిప్రియ ప్రోత్సాహక బహుమతి, సీనియర్ విభాగంలో ఎస్.ప్రణయ్ కార్తీక్ రెండో బహుమతి, తెలుగు వక్తృత్వ పోటీల్లో కె.సిరివల్లి రెండో బహుమతి, లేఖారచనలో ఎం. శృతికా ప్రథమ బహుమతి సాధించారన్నారు. తమ పాఠశాలకు చెందిన మరో పది మంది ప్రోత్సాహక బహుమతులు పొందారన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

మండవల్లి, నవంబరు18(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం, కార్తీక సోమవారాలను పురస్కరించుకుని శ్రీఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక భీమవరం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మండవల్లిలో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాల ప్రచారం చేశారు. కార్తీక మాసం డిసెంబరు 1వ తేదీ వరకు ఉంటుందని అందరూ దీపారాధన చేయాలన్నారు. కమిటీ సభ్యులు ఉదయ్‌కుమార్, నాగేశ్వరరావు, వాసుదేవా, రాజు, తారకేశ్వరి, సుజాత, లక్ష్మీ, భానుమతి, సత్యనారాయణ, శ్రీకర్, దుర్గాభవానీ, రాము తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేదారేశ్వర స్వామి వ్రతం

మండవల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో నోముల వ్రతాన్ని ప్రత్యేకంగా నిర్వహించారు. గృహాల్లో మావిడాకులతో తోరణాలు అలకరించి వివిధ వంటకాలు చేసి కేతారేశ్వర స్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అల్లినగరంలో రుక్మిణి సత్యభామ సమేత రాజగో పాల స్వామి ఆలయంలో దీపోత్సవం, ఉంజల్‌సేవా నిర్వహించారు.

కొనుగోలు కేంద్రాల్లో వరి పంటకు మద్దతు ధర

ముసునూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్ళు ప్రారంభమయ్యాయని, రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని ఏవో ఎస్.మధుమోహన్ అన్నారు. సోమవారం చింతవల్లిలో ధాన్యం కొనుగోలును ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. ప్రభుత్వం నిర్ధేశించిన నాణ్యత ప్రమాణాలైన తేమశాతం 17, రంగు మారిన, మొలకెత్తిన ధాన్యం ఐదు శాతం మాత్రమే ఉండాలన్నారు. ఈ-పంట నమోదు చేసుకుని, ఈకేవైసీ పూర్తయిన రైతుల నుంచి మాత్రమే ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. సాధారణ రకాలకు క్వింటాకు రూ.2,300, ఎ-గ్రేడ్ రకానికి రూ. 2320 ధరను ప్రభుత్వం నిర్ణయించిందని, ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో నేరుగా నగదు పడుతుందన్నారు. రైతులు మరిన్ని వివరాల కోసం టోల్‌ఫ్రీ నెంబరు 1967ను సంప్రదించాలని ఏవో కోరారు. వీఏఏ పావని, సొసైటీ సెక్రటరీ ప్రసాద్, రైతులు నవీన్, గంగధరరావు పాల్గొన్నారు.


చింతవల్లిలో ధాన్యం లోడ్ చేయిస్తున్న ఏవో

ఘనంగా గుర్రాలమ్మ కల్యాణోత్సవాలు ప్రారంభం

ముసునూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కొర్లకుంట గ్రామంలో వున్న గుర్రాలమ్మ అమ్మవారి కల్యాణ మహోత్సవాలు కార్తీక సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామ ప్రముఖులు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈనెల 20న గుర్రాలమ్మ, గుర్రాలయ్య స్వామివార్ల కల్యాణ మహోత్సవం జరుగుతుందని, ఆలయ కమిటీ, గ్రామ ప్రముఖుల ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధను ఏర్పాటు చేశామని మూల్పూరి తెలిపారు. అమ్మవారి కల్యాణానికి వేలాది భక్తులు తరలివచ్చి, కల్యాణ మహోత్సవాన్ని తిలకించి, అన్నప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.


గుర్రాలమ్మకు పట్టువస్త్రాలు అందజేస్తున్న మూల్పూరి దంపతులు


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి : ఎస్పీ

నూజివీడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) :ప్రజా ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి సత్వరమే పరిష్కరించాలని ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ అన్నారు. నూజివీడు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూరప్రాంతాల నుంచి జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేనివారు దగ్గరలోని పోలీస్‌స్టేషన్, ఇతర పోలీస్ అధికారుల కార్యాలయాలకు వెళ్ళి తమ సమస్యలపై ప్రజావేదికలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. సకాలంలో పరిగణనలోకి తీసుకుని న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కాంగ్రెస్ సీనియర్ నేత నాగేశ్వరరావు మృతి

ఆగిరిపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అన్నే నాగేశ్వరరావు(85) స్వగృహంలో సోమవారం ఉదయం మృతిచెందారు. ఆగిరిపల్లి మండలం కృష్ణవరం గ్రామ సర్పంచ్‌గా ఒకసారి, పీఏసీఎస్ ప్రెసిడెంట్‌గా రెండుసార్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన పార్థీవ దేహాన్ని పలువురు గ్రామస్థులు, రాజకీయ నాయకులు నివాళులర్పించారు.

బాల్య వివాహాలు అనర్థదాయకం

ముదినేపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ బాల్య వివాహాలు జరుగుతుండటం సమర్థనీయం కాదని తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహనరావు ఆవేదన వ్యక్తం చేశారు. చిగురుకోటలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు - అనర్థాలు అన్న అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. సర్పంచ్ చొప్పర వెంకటరమణ, తెలుగు యువత జిల్లా కార్యదర్శి కందేపి పద్మ, హెచ్‌ఎం శ్రీధర్, అంగన్‌వాడీ టీచర్‌లు అరుణ కుమారి, గంగాభవానీ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య షష్టికి ఏర్పాట్లు

ముదినేపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో డిసెంబరు 6 నుంచి ప్రారంభం కానున్న షష్టి కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగాదేవి ఆధ్వర్యంలో చేపట్టారు.

క్రైమ్ కార్నర్

ఎక్సైజ్ పోలీసుల దాడి.. ఒకరి అరెస్ట్

ఆగిరిపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో జరిపిన దాడుల్లో ఆగిరిపల్లి మండలం ఆగిరిపల్లి గ్రామానికి చెందిన పరసా కొండలరావును అరెస్ట్ చేశామని ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తానయ్య తెలిపారు. అతడి వద్ద నుంచి ఆరు మద్యం సీసాలను స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో నూజివీడు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సబ్-ఇన్‌స్పెక్టర్లు అయిన వై.ఈశ్వరరావు, ఎం.ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు. నూజివీడు, ముసునూరు, ఆగిరిపల్లి, చాట్రాయి మండలంలోని పదహారు మద్యం దుకాణదారులకు ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతిమనిషికి మూడు మద్యం బాటిల్ మించి ఇవ్వకూడదన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే మద్యం విక్రయించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు జరిపితే 99495 39933 కు సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటామని సమాచారమిచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

కాల్వలో గ్యాస్ సిలిండర్ల వ్యాన్ బోల్తా.. డ్రైవర్ మృతి


శివనాగరాజు

కలిదిండి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇండేన్ గ్యాస్ సిలిండర్ల వ్యాన్ ప్రమాదవశాత్తు అదుపు తప్పి కాల్వలో బోల్తా పడడంతో డ్రైవర్ మృతి చెందాడు. కలిదిండి ఒకటో వార్డుకి చెందిన పోసిన శివ నాగరాజు (28) సోమవారం అమరావతిలో రోడ్డు పక్కన గ్యాస్ సిలెండర్ల వ్యాన్ ఆపి వినియోగదారులకు గ్యాస్ సిలెండర్లు దింపుతుండగా వ్యాన్ ఒకసారిగా ముందుకు కదలడంతో అదుపు చేయడానికి క్యాబిన్ లోపలకు వెళ్తుండగా కాల్వలో బోల్తా పడడంతో మృతి చెందాడు. శివనాగరాజుకి ఏడాది క్రితం అదే గ్రామానికి చెందిన ప్రసున్నాంబతో వివాహమైంది. అందరితో కలివిడిగా ఉండే శివనాగరాజు అయ్యప్ప మాలధారణలో ఆకస్మాత్తుగా దుర్మరణం చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు శోక సంద్రంలో మునిగిపోయారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలిం చారు. ఎస్‌ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.